## రుణంపైనే ఆధారపడ్డ రైతన్నలు

కరీంనగర్, పంటరుణాల పంపిణీలో జగిత్యాల జిల్లాలో కనీసం 50శాతం మంది రైతులకు కూడా చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు పంటరుణ పరిమితి అమలు లేకపోగా నిబంధనల ప్రకారం పంటరుణం తీసుకునే ప్రతిరైతుకు కిసాన్‌క్రెడిట్ కార్డును ఇవ్వాలి. రైతు ఖాతాలో బ్యాంకర్లు రుణం నిధులను జమచేసిన తరువాత రైతు వాడుకున్న మొత్తానికే వడ్డీ చెల్లించాలి. రైతుకు ఒకేసారి నిధులు అవసరం ఉండవు. పంట సాగునుంచి చివరి వరకు దఫాలుగా నిధులు అవసరం ఉంటాయి కాబట్టి ఖాతాలో నుంచి కార్డుద్వారా అవసరం ఉన్నపుడు తీసుకుని తిరిగి ఖాతాలో జమచేసే వీలుండాలి. దీనివల్ల రైతులకు ఎప్పుడూ నిధులు అందుబాటులో ఉంటాయి, వడ్డీ తగ్గుతుంది. పంటకాలంలోనైనా తమకు పంటరుణాలు దక్కుతాయని అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండగా వీరికి ప్రభుత్వం అందించే పంటరుణాలే ఆధారం కానున్నాయి. గతకొన్ని సీజన్లుగా పంటరుణాల పంపిణీ లక్ష్యానికి దూరంగానే నిలిచిపోతుండగా కౌలు రైతులకు సైతం పంటరుణాల


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :119 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శుక్రవారం 11-07-2025 పేజీలు:4 వెల: 2.00


## అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయి.. భారత వాణిజ్య శాఖ వెల్లడి



న్యూఢిల్లీ,అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయని వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గురువారం తెలిపారు. భారతదేశం-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అగర్వాల్ ముఖ్య సంధానకర్తగా ఉన్నారు.ఇప్పటికే పలుమార్లు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపారు. త్వరలోనే ఒక కొలిక్కి అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ గడువు జూలై 9తో ముగిసిపోయింది. అయితే కొన్ని దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు పొడిగించారు. అయితే అమెరికా.. భారత్‌లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై మినహాయింపులు కోరుతోంది. ఈ రెండు కూడా భారతదేశంలో చాలా సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సందిగ్ధంలో పడ్డాయి.తాజాగా ఇదే అంశంపై గురువారం రాజేష్ అగర్వాల్ స్పందించారు. ఎగుమతి లాజిస్టిక్స్‌పై జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ వాణిజ్య ఒప్పందాలపై మాట్లాడారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారతదేశం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ ఒప్పందం యొక్క మొదటి దశను సెప్టెంబర్-అక్టోబర్ నాటికి ముగించడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భారతదేశం ఇప్పటి వరకు 26 దేశాలతో 14కి పైగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అమలు చేసిందని అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం ప్రధాన మార్కెట్లతో అనుసంధానం అవుతున్నామని.. ఇప్పటికే యూకేతో ఒక ఒప్పందాన్ని ముగించినట్లు పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో కూడా చర్చల దశలో ఉన్నట్లు తెలిపారు.ఇక భారతదేశం.. చిలీ, పెరూ వంటి లాటిన్ అమెరికన్ దేశాలతో కూడా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఆస్ట్రేలియా, యూఏఈలతో వాణిజ్య ఒప్పందాలు ఉన్నాయని.. న్యూజిలాండ్‌తో కూడా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పెద్ద ఎత్తున ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు.ఏప్రిల 2న ట్రంప్.. ఆయా దేశాలపై సుంకాలు విధించారు. అయితే ఆయా దేశాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో ఈ నిర్ణయాన్ని మూడు నెలల పాటు తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఆ డెడ్‌లైన్ మొన్న జూలై 9తో ముగిసింది. ఈ మేరకు ఆయా దేశాలను హెచ్చరిస్తూ లేఖలు కూడా రాశారు. ఇక రెండు మిత్ర దేశాలకు ఇప్పటికే సుంకాలు విధించారు. మిగతా దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు విధించారు. ఈలోపు అమెరికాతో ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అమెరితో యూకే, వియత్నాం మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయి. చైనా మాత్రం పరస్పరం తాత్కాలింగా తగ్గించుకోవాలని నిర్ణయం తీసుకున్నాయి.

## సిట్ విచారణకు సహకరించని ప్రభాకర్ రావు

హైదరాబాద్,జూలై10: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిట్ అధికారులు ఢిల్లీకి వెళ్లారు. వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, సిట్ అధికారి ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి చేరుకున్నారు. ఇప్పటివరకూ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును సిట్ అధికారులు ఐదుసార్లు విచారించారు. ఐదుసార్లు సుమారు నలభై గంటలపాటు ప్రభాకర్‌రావును సిట్ విచారించింది. అయితే విచారణలో సమాధానాలు చెప్పకుండా ఎస్ఐబీ మాజీ చీఫ్ అధికారుల సహనాన్ని పరీక్షించారు. ఈ క్రమంలో ప్రభాకర్ రావు విచారణకు సహకరించకపోవడంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సుప్రీంకోర్టులో ప్రభాకర్ రావుకు ఉన్న రిలీఫ్ రద్దు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి వెళ్లారు. గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. పిటిషన్‌లో ప్రభాకర్ రావు మినహాయింపులు రద్దు చేయాలని కోరనున్నారు. ప్రభాకర్ రావును కస్టోడియల్ విచారణ చేస్తే కీలకమైన విషయాలు వెలుగు చూస్తాయని సిట్ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ప్రభాకర్ రావును ఆగస్టు ఐదు వరకు అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఇప్పటివరకూ సిట్ అధికారులను ప్రభాకర్ రావు తప్పుదోవ పట్టించే విధంగానే సమాధానాలు చెబుతూ వచ్చారు. తనకేమీ సంబంధం లేదని, తన పైస్థాయి అధికారులు




ఇచ్చిన ఆదేశాలనే అమలు చేశానని, వ్యక్తిగతంగా ఫోన్ ట్యాపింగ్ చేయమంటూ ఎవరికీ ఉత్తర్వులు ఇవ్వలేదంటూ చెప్పుకొచ్చారు. కానీ ఈ కేసులో అరెస్ట్ అయిన ఐదుగురు నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం.. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే తాము ఇదంతా చేశామని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో ఆగస్టు 5 వరకు ప్రభాకర్ రావును అరెస్ట్ చేయొద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో..సిట్ అధికారులకు ఆయన డిఫెన్సివ్ మోడ్‌లోనే సమాధానాలు చెబుతూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీం ఇచ్చిన మినహాయింపులను రద్దు చేస్తే ఎస్ఐబీ మాజీ చీఫ్‌ను కస్టోడియల్ విచారణకు తీసుకునే అవకాశం ఉంటు-ంది. ఈ మేరకు ప్రభాకర్ రావుకు ఇచ్చిన మినహాయింపులు రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు.


## ఉద్యోగాలే కాదు..రాజకీయాల్లోకి కూడా రండి

పుట్టపర్తి,ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ను ప్రభుత్వం నిర్వహించింది. వరుసగా రెండో ఏడాదీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. మెగా పీటీఎం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయుడిగా మారారు. జెడ్పీ హైస్కూల్‌లో సహజ వనరులు, పునరుత్పాదక వనరుల వినియోగం, సంరక్షణ గురించి విద్యార్థులకు సీఎం బోధించారు. సుస్థిరమైన అభివృద్ధి సాధించాలంటే వనరుల సద్వినియోగం అవసరమని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలు కూడా ఇతరులు మరోమారు వినియోగించుకునేలా జాగ్రత్తగా వాడాలని సూచించారు. విద్యుత్, నీరు లాంటి వనరుల సద్వినియోగం కూడా సామాజిక బాధ్యత అంటూ స్టూడెంట్స్‌కు చెప్పారు చంద్రబాబు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల వైపు విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. అందరూ ఉద్యోగాలే కాదు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాప్రతినిధులుగానూ మారాలన్నారు. నారా లోకేశ్ బాగా చదువుకుని ఇప్పుడు రాష్ట్రానికి మంత్రి అయ్యారని వెల్లడించారు. ప్రజలకు మంచి చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్.. విద్యార్థులతోపాటు- బల్లపై కూర్చుని సీఎం చెప్పే పాఠాన్ని ఆసక్తిగా విన్నారు. విద్యార్థులు చిత్రించిన తల్లికి వందనం పోస్టర్లు, కళారూపాలను సీఎం, మంత్రి తిలకించారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లోగోతో రూపొందించిన ఫొటో ఫ్రేమ్‌లో చంద్రబాబు, లోకేశ్ ఫొటోలు దిగారు. పాఠశాలకు వచ్చిన సీఎంకు ఎన్సీసీ క్యాడెట్‌లు గౌరవ వందనం సమర్పించి స్కూల్లోకి తీసుకుని వచ్చారు. జెడ్పీ పాఠశాల క్యాంపస్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ మాటామంతి నిర్వహించారు.



విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వడంతో పాటు-.. మార్కులు పెంచుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని సీఎం ఆకాంక్షించారు. హాజరు, మార్కుల వివరాలను తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ద్వారా రాష్ట్రంలో కోటి మొక్కలు నాటు-తామని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రైవేటు బదులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు- ఆటలు, పాటలు, యోగా నేర్పిస్తున్నామని తెలిపారు. ప్రతి విజయం వెనుక గురువు ఉంటారు. తరగతి గదిలో జీవిత పాఠాలు చెప్పేది మన గురువు. మన ఎదుగుదలను కోరుకునేది మన గురువులే. మనకు నడక, బాధ్యత నేర్పేది అమ్మ. తల్లి పట్ల గౌరవం పెంచడానికే తల్లికి వందనం. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారు. షైనింగ్ స్టార్స్ ద్వారా నిరుపేద కుటుంబాల పిల్లకు ఆర్థిక సాయం చేశాం. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యతలేని యూనిఫామ్‌లు ఇచ్చారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేదు. ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జరుగుతోంది. అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని పిలుపు మేరకు రాష్ట్రంలో కోటి మొక్కలు నాటాలని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ సవాల్ విసిరారు. పవన్ సవాల్‌ను నేను స్వీకరిస్తున్నా. విద్యాశాఖ ద్వారానే కోటి మొక్కలు నాటుతామని మంత్రి లోకేశ్ తెలిపారు.

## ఢిల్లీ సహా ఉత్తరాదిలో స్వల్ప భూ ప్రకంపనలు



న్యూఢిల్లీ,జూలై10: దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాదిలో పలు ప్రాంతాల్లో స్వల్ప భూకంపం వచ్చింది. గురువారం ఉదయం 9.04 గంటలకు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తోపాటు దాని సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రాల్లో భూమి కంపించింది. దీని తీవ్రత 4.4 గా ఉన్నదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం హర్యానాలోని జజ్జర్‌లో ఉన్నదని తెలిపింది. భూమి అంతర్భాగంలో 10 కిలోమీటర్లలోతులో ప్రకంపనలు సంభవించాయని పేర్కొంది. భూకంపంతో భయందోళనలకు గురైన ప్రజలు రోడ్లపైకి పరుగులు తీశారు. ఢిల్లీ రాజధాని పరిధిలోని నోయిడా, గజియాబాద్‌తోపాటు- హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో కూడా భూమి కంపించిందని అధికారులు వెల్లడించారు. ఇలా ఉత్తర భారత వాసులను భూకంపం వణికించింది. దేశ రాజధాని ఢిల్లీ, ఎన్‌సీఆర్ సహా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం భూప్రకంపనలు సంభవించాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హరియాణాలోని ఝజ్జర్‌కు ఈశాన్యాన 3 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు- జాతీయ భూకంప కేంద్రం వెల్లడించింది. ఈ ప్రాంతం పశ్చిమ ఢిల్లీకి కేవలం 51 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. దీంతో దేశ రాజధానిలో ప్రకంపనలు భారీగానే చోటుచేసుకున్నాయి. రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోనూ భూమి కంపించింది. గతంతో పోలిస్తే ఈసారి ప్రకంపనల తీవ్రత కాస్త ఎక్కువగానే ఉన్నట్లు- తెలుస్తోంది. భూమి కంపించడంతో అనేక చోట్ల ప్రజలు, కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించ లేదని అధికారులు తెలిపారు. మరోవైపు, ఢిల్లీలో బుధవారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు ఇప్పుడు ప్రకంపనలు చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటు ఎన్డీఆర్ఎఫ్ దీనిపై అడ్వైజరీ జారీ చేసింది. ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఇలాంటి సమయాల్లో లిఫ్ట్‌కు బదులుగా మెట్లు దిగి కిందకు రావాలని సూచించింది.

## ఐదేళ్లు నేనే సీఎంను.. ప్రస్తుతానికి కుర్చీ ఖాళీ లేదు

బెంగళూర్ : కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి స్పందించారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను తీవ్రంగా ఖండించారు. ఐదేళ్ల పాటూ తాను ఈ పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో 'సీఎం మార్పు'పై స్పష్టతనిచ్చారు. ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.'నేను ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటాను. రాజీనామా చేయమని కాంగ్రెస్ హైకమాండ్ నన్ను ఆదేశించలేదు. నేను సీఎంగా దిగిపోయి డీకే శివకుమార్‌కు దారి ఇవ్వాలంటూ కాంగ్రెస్ హైకమాండ్ కోరిందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఈ విషయంపై నేను ఇప్పటికే స్పష్టత ఇచ్చాను. జులై 2న ప్రకటన కూడా చేశాను. ఆ రోజు డీకే శివకుమార్ కూడా అక్కడే ఉన్నారు. డీకే శివకుమార్ సీఎం కావాలని ఆశపడుతున్నారు. అందులో తప్పు లేదు. అయితే ప్రస్తుతానికి కుర్చీ ఖాళీగా లేదు అంటూ చెప్పుకొచ్చారు.ముఖ్యమంత్రి పీఠంపై డీకే శివకుమార్ , సీఎం సిద్ధరామయ్య ఇద్దరూ చెరో రెండున్నరేళ్లు ఉంటారంటూ జరుగుతున్న ప్రచారంపై కూడా సిద్ధరామయ్య స్పందించారు. 'రెండున్నర సంవత్సరాలు అంటూ ఎప్పుడూ నిర్ణయించలేదు. అది సరైంది కూడా కాదు. ఏ నిర్ణయం తీసుకున్నా దానికి మేము కట్టుబడి ఉండాలని హైకమాండ్ చెప్పింది. మాది హైకమాండ్ పార్టీ అని మల్లికార్జున ఖర్గే కూడా ఇప్పటికే స్పష్టంగా చెప్పారు. వారు ఏం చెప్పినా మేం దాన్ని అనుసరించాలి. నేనూ అదే చేస్తున్నా.




డీకే శివకుమార్ కూడా దాన్నే అనుసరిస్తారు' అంటూ సిద్ధరామయ్య చెప్పుకొచ్చారు.కర్ణాటక ముఖ్యమంత్రిమార్పుపై ప్రతిష్టంభణ కొనసాగుతోంది. కర్ణాటకలో నాయకత్వ మార్పు ఉండదని, తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని స్వయంగా సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేసినప్పటికీ దీనిపై చర్చ మాత్రం ఆగడం లేదు. పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే సీఎం మార్పును కోరుకుంటూ కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు డీకే శివకుమార్‌కే ఉందంటూ ఎమ్మెల్యేలు ఒకరి తర్వాత ఒకరు మీడియా ముందుకొచ్చి చెబుతుండటంతో కర్ణాటక రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

## కేసీఆర్ - జగన్ స్నేహంపై రేవంత్ ఫైర్



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరొకసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ల స్నేహం వల్లే తెలంగాణ జలవివాదాల్లో కూరుకుపోయిందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగొచ్చిన రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు మాజీ సీఎంల మధ్య ఉన్న 'స్నేహబంధం' రాష్ట్రానికి మేలు చేసేలా కాకుండా, నష్టం కలిగించేలా మారిందని విమర్శించారు. ఈ వ్యవహారం వల్లే తెలంగాణ సమాజానికి మరణ శాసనం రాశారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

-కేసీఆర్ - జగన్ స్నేహంపై రేవంత్ ఫైర్

"కేసీఆర్ ఎవరిని అడిగి జలాల విషయంలో అంత పెద్ద సమాజాన్ని ఆపదలో పడేశాడు? ఏపీ సీఎం జగన్‌తో చేతులు కలిపి, తెలంగాణ గొంతు కోశాడు. బేసిన్లు లేవన్నారు, భేషజాలు లేవన్నారు. గోదావరి నుంచి నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని ప్రజలను మభ్యపెట్టారు. కానీ నిజంగా కేసీఆర్ చేసిన పొరపాట్లే ఇప్పుడు రాష్ట్రాన్ని దుస్థితికి నెట్టాయి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు.

- హైదరాబాద్ నీటి వాటాపై కేసీఆర్ నిర్లక్ష్యం

రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృష్ణా జలాల సమస్యలపై వివరణ ఇచ్చిన అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌కు వచ్చే నీటి వాటాను ఉమ్మడి జల వనరుల నుండి వేరు చేయాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరించారని మండిపడ్డారు. "హైదరాబాద్‌కు అవసరమైన నీటి హక్కు వేరే. మిగతా వాటిని మాత్రమే రెండు రాష్ట్రాలు పంచుకోవాలి. కానీ ఈ చిన్న విషయాన్ని కూడా గుర్తించకుండా, కేసీఆర్ ప్రవర్తించిన విధానం వల్లే తెలంగాణ దెబ్బతింది" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా "ఏపీకి ముందుగా నీళు విడుదల చేసేలా వ్యవహరించి, తెలంగాణ వాటా తర్వాత చూసే పరిస్థితిని తీసుకొచ్చారు. దీని ప్రభావం ఇప్పుడు తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్నారు. మీరు మీ స్నేహాలు, ఒప్పందాలు చేసుకోవచ్చు. కానీ తెలంగాణ సమాజాన్ని ముంచే హక్కు మీకు ఎవరు ఇచ్చారు?" అంటూ కేసీఆర్‌పై ఘాటుగా ప్రశ్నించారు.సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు గత పాలనలో జరిగిన కీలకమైన తప్పుడు నిర్ణయాలపై ప్రజల దృష్టిని మరల్చడానికి ఉద్దేశించినవిగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. జలవివాదాలపై తెలంగాణ ప్రభుత్వం కొత్త వైఖరి ప్రకటించే అవకాశం ఉందని కూడా అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ అంశం రాజకీయంగా మరింత వేడి రేపే అవకాశం కనిపిస్తోంది.

### కల్తీ కల్లులో రసాయనాలు ఉన్నట్లు గుర్తింపు

హైదరాబాద్,కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. మొత్తం 37 మంది అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆసుపత్రిలో 31 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 27 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నలుగురికి డయాలసిస్ చేస్తున్నట్లు- చెప్పారు.

## బీహార్ ఎన్నికల్లో రిగ్గింగ్ జరగనివ్వం.. కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్



ముంబై: మహారాష్ట్రలో బీజేపీ నకిలీ ఓట్లను సృష్టించి, ఫలితాలను తారుమారు చేయడానికి వాటిని ఉపయోగించుకుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన ఎన్నికల సంఘం బీజేపీ ఆదేశాల మేరకు పని చేస్తోందని ఆరోపించారు. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా రిగ్గింగ్ జరిగింది.. కానీ, త్వరలో బీహార్‌లో జరిగే ఎన్నికల్లోనూ ఇలాంటి ఫలితాలను పునరావృతం చేయాలని కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ ట్రై చేస్తుందని ఆరోపించారు. ఇందులో భాగంగా ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సవరణ ద్వారా ప్రజల నుంచి ఓటు హక్కును లాగేసుకునేందుకు కుట్ర చేస్తుందని రాహుల్ గాంధీ విమర్శించారు.అయితే, బీజేపీ నామినేట్ చేసిన ఎన్నికల కమిషనర్లు ఆ పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజల ఓట్లను, ముఖ్యంగా యువతను ఓట్లును దొంగిలించడానికి ఈసీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు, ఎన్నికల కమిషన్ ఒక రాజకీయ పార్టీలా మారిందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. ఓటర్ లిస్ట్ నుంచి పేర్లను తొలగించి, వారికి రేషన్, పెన్షన్ ఇవ్వడం లేదని నితీష్ కుమార్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

## సంపాదకీయం

**శుక్రవారం 11-07-2025**

# రైతు ఆత్మహత్యల నిరోధంలో నిర్లక్ష్యం !

ప్రభుత్వాలు గొప్పగా రైతులను అన్ని విధులుగా ఆదుకుంటున్నామని, పంటపెట్టుబడులు అందిస్తున్నా మని, రుణమాఫీలు చేస్తున్నామని ప్రకటించుకుంటోంది. అలాగే నీటి తీరువా రద్దు, ఉచిత విద్యుత్ సౌకర్యాలుకూడా అందిస్తున్నామని చెబుతోంది. ఎన్నిచేసినా పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. పండిన పంటల కొనుగోళ్లు సకాలంలో సజావుగా సాగడం లేదు. బీమా పథకాలు అందడం లేదు. ఈ సమస్యలపై ప్రభుత్వాలు చర్చించడం లేదు. అందుకే దేశంలో మొత్తం ఆత్మహత్యల్లో 11 శాతం రైతులవే ఉంటున్నాయి. ఆత్మహత్యల రేటులో ప్రతి లక్షమంది జనాభాకు రైతులు 1.4 శాతం మంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అభివృద్ధిచెందిన రాష్ట్రాలైన దక్షిణాదిలోనే అత్యధికంగా రైతు ఆత్మహత్యలు ఉన్నాయి. పంటనష్టం,దివాళా, వ్యవసాయ సంబంధ సమస్యలు రైతు ఆత్మహత్యలకు ప్రధాన కారణాలని కేంద్రం విశ్లేషించింది. రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వాలు సీరియస్‌గా ఆలోచించడం లేదు. ఎందుకిలా జరుగుతుందో చర్చించడం లేదు. కూలీ రేట్లు అధికమవ్వడం, వాతావరణ దుష్పరి ణామాలు, ధరలు పెరుగుదల వంటివి కూడా కర్షకుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. పేద రైతులు ప్రధానంగా అప్పులపై ఆధారపడి వ్యవసాయం చేస్తారు. తక్కువ సమయంలోనే అప్పులు చెల్లించాల్సి ఉండటంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.అధిక వడ్డీరేట్లు ఉండటం, మొదటి దఫా అప్పు చెల్లించక పోవడంతో రెండోదఫా నిరాకరించ డం, రైతులకు ఇవ్వాల్సిన రుణాలను ఇతర రంగాలకు మళ్లించడం వంటివి కూడా సమస్యలుగా మారుతున్నాయి. రైతులకు కొంత మొత్తంలోనే రుణాలిచ్చిన బ్యాంకులు.. రుణమాఫీని కూడా క్రమశిక్షణ రాహిత్యం గా చూపుతున్నాయి. అది ఆర్థిక వ్యవస్థకు మంచిదికాదని ప్రభుత్వాలకే హితవు చెబుతున్నాయి. జీవన వ్యయం రోజురోజుకు పెరిగిపోతుండటంతో దాన్ని అందుకోలేని రైతు ఆత్మహత్యే శరణ్యం అనుకుం టున్నాడు. రైతులకు వచ్చే అరకొర ఆదాయంతో కనీస అవసరాలు తీర్చుకోలేక, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు లభించక వ్యవసాయ వృత్తిలోనే కూరుకు పోవడంతో రైతు తీవ్ర మానసిక క్షోభతో ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని అర్థం చేసుకోవచ్చు. అప్పు అనేది సామాజికంగా రైతును కుంగదీస్తుంది. తనకు వచ్చే ఆదాయంతో అప్పు తీర్చలేకపోతున్నాడు. దీనికి తోడు కుటుంబ ఖర్చులు పెరుగుతున్నాయి. గతంలో మాదిరిగా ఇంటిల్లిపాది వ్యవసాయ పనుల్లో పాలుపంచు కునే పరిస్థితులు ఇప్పుడు లేవు. దీంతో కుటుంబ సభ్యులను సంతృప్తి పరచలేక.. పరువు పోతోందనే ఆవేదనతో..నిస్సహాయ స్థితిలో రైతులు ఆత్మహత్యల కు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు ఆగాలంటే.. పంటలకు గిట్టుబాటు ధరను కల్పించడం చాలా కీలకం. రైతు హక్కులు కూడా మానవ హక్కులే. దానిపై ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి. వ్యవస్థాగత రుణాలు కల్పించాలి. రైతులకు సరైన శిక్షణ ఇచ్చి లాభాలు పొందేటట్లు చేయాలి. సామాజికం గా పౌరులు, మీడియా, ఇతర స్వచ్ఛంద సంస్థలు రైతు సమస్యలను తీవ్రమైన, ముఖ్యమైన అంశంగా పరిగణించి ఆత్మహత్య నివారణ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. రైతులేని రాజ్యం నిలువదు. రైతుని కాపాడుకుంటేనే దేశం సస్యశ్యామలం అవుతుంది. అందుకే రైతుల ఆత్మహత్యలను నిరోధించి, రైతుకు ముఖ్యమైన స్థానం ఇచ్చి కాపాడాల్సిన అవసరం తక్షణావసరంగా గుర్తించాలి. మనదేశం వ్యవసాయ ఆధారిత దేశం కావడంతో దాదాపు 83 కోట్ల మందికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 70 శాతం గ్రామీణ మహిళలు వ్యవసాయం జీవనాధారంగా జీవిస్తున్నారు. 1991లో వచ్చిన సంస్కరణల తర్వాత మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కలు చెబుతున్నాయి. దేశంలో రోజుకుసగటున 46 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంటే ప్రతి అరగంటకు ఒక రైతు చనిపోతున్నాడని అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయం అసంఘటిత రంగంలో ఉండటంతో పథకాలు కూడా లబ్ధిదారులకు సరిగా చేరడం లేదు. అందుకే తెలుగు రాష్ట్రాల్లో రైతులకు బాగానే చేయూత లభిస్తున్నా.. ఆశించిన ఫలితాలు రావడం లేదు. తెలంగాణలో, రుణమాఫీ, రైతు భరోసా లాంటి పథకాలున్నాయి. ఏపీలోనూ అన్నదాతకు ఆర్థిక సాయం అందుతోంది. అయినా సరే రైతులు నిలదొక్కుకోలేకపోతున్నారు. వ్యవసాయం లో పేరుకుపోయిన సమస్యలు కర్షకుల్ని కుంగదీస్తున్నాయి. అందుకు కేవలం ఆర్థిక సాయంతో అన్నదాతకు భరోసా ఇవ్వడం కుదరదని చాలామంది నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ దిగుబడుల విషయంలోనూ మన దేశం చాలా వెనుకబడి ఉంది. హరిత విప్లవం తర్వాత దిగుబడి పెరిగిన మాట నిజమే అయినా.. ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర ఉత్పాదకత ఇంకా తక్కువ గానే ఉంది. ఇక పంటలు అమ్ముకోవడానికి రైతులు నానా యాతన పడుతున్నారు. మార్కెట్లల్లో తీవ్ర అవినీతి చోటు చేసుకుంటోంది. ప్రభుత్వాలు ఈ అవినీతిని కట్టడి చేయలేక చేతులెత్తేస్తున్నాయి. అందుకే ఏటా మద్దతు ధర ప్రకటిస్తున్న పంటలకు కూడా పూర్తిస్థాయి ఆ ధర దక్కడం లేదు. వ్యవసాయంలో మహిళలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. కాబట్టి వారి సంక్షేమానికి ప్రత్యేక పథకాలు రూపొందించాలి. రుణాలు, రుణ హామీలు, రుణ బదిలీలు, మాఫీలు అన్నింటికి చట్టబద్ధత కల్పించి ప్రభుత్వాలు, బ్యాంకులు జవాబుదారీగా వ్యవహరిం చాలి. ప్రధానంగా వ్యవసాయనుబంధ రంగాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. కోళ్లపెంపకం, పశువుల పెంపకం, కూరగాయల సాగును ప్రోత్సహించాలి. వీటికి మార్కెట్ సౌకర్యం కల్పించాలి. రైతు సమస్యల పరిష్కారం లక్ష్యంగా 2004లో ప్రొఫెసర్ ఎంఎస్. స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ రైతు కమిషన్ ఏర్పాటు చేశారు. పంటలకు మద్దతు ధరలపై శాస్త్రీయత ఉండాలనే అభిప్రాయం వచ్చింది. అనేక సూచనలు చేసింది. వాటిని ముందుగా అమలు చేయాలి. సుప్రీంకోర్టు రైతు ఆత్మహత్యల అంశాన్ని చాలా ప్రాధాన్యాంశంగా పరిగణించింది. రైతులు చనిపోయాక పరిహారం ఇచ్చి అదే పరిష్కారం అనుకోవడమే తప్పని సూత్రీకరించింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మళ్లీ వాటిని చెల్లించకలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దశాబ్దాల తరబడి రైతులు చనిపోతున్నా ఆత్మహత్యల వెనుక అసలైన సమస్యను పరిష్కరించే చర్యలు లేకపోవడంపై సుప్రీం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అయితే సంక్షోభాల నివారణకు శాస్త్రీయ దృక్పథం అవసరం. అప్పుడే వ్యవసాయం పురోగమించ గలదు. ఆత్మహత్యలను నిరోధించగలం. ఉత్పత్తిని పెంచగలం. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భాగస్వామిని చేయగలం.

# ఇంధన నిషేధంలో కార్పొరేట్ కుట్ర!

న్యూఢిల్లీ,ప్రపంచంలోనే అత్యంత కాలుష్యభరితమైన రాజధానిగా అపఖ్యాతి మూటగట్టుకుంటున్న ఢిల్లీ నగరంలో ప్రజలకు స్వచ్ఛమైన గాలి, తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించవలసింది పోయి కార్పొరేట్ కుట్రలకు తలవంచి ప్రజలపై మరిన్ని భారాలు మోపేందుకు వెనుకాడటంలేదని ఇటీవల పాతవాహనాలకు పెట్రోల్, డీజిల్ ఇవ్వకుండా నిషేధం విధించడం ద్వారా ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వం నిరూపించింది. గత జులై 1 నుంచి 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలకు, 15 సంవత్సరాల కంటే పాతవైన పెట్రోల్ వాహనాలకు ఇంధనం నింపకుండా నిషేధం అమలు జరిపారు. అయితే ఈ నిషేధంపై ఢిల్లీ ప్రజలనుండి తీవ్రమైన వ్యతిరేకత, ఆగ్రవేశాలు వ్యక్తం కావడంతో మూడు రోజులకే ఢిల్లీ ప్రభుత్వం వెనకడుగు వేసింది.నిషేధాన్ని తాత్కాలికంగా ఉపసంహరించుకుంది. ఈ నిషేధాన్ని అమలు చేయడం ద్వారా ఆటో మొబైల్ రంగంలో అమ్మకాలు పెరుగుతాయని, ప్రభుత్వానికి కూడా పన్నుల రూపంలో భారీగా ఆదాయం చేకూరుతుందని అంచనా వేశారు. అంటే ప్రధానంగా కార్ల కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతోనే ఈ నిషేధాన్ని అమలు చేసే ప్రయత్నం చేసినట్లువెల్లడవుతుంది. ఈ నిషేధం కారణంగా అత్యధిక ప్రయోజనం భారతదేశంలోని అతిపెద్ద కార్ల తయారీదారులలో ఒకటైన టాటా గ్రూప్ మాత్రమే పొందగలదు. ఢిల్లీలో కార్లపై ఈ నిషేధం ప్రధానంగా టాటా గ్రూప్ నిధులు సమకూర్చే ఓ స్వచ్ఛంద సంస్థ సిఫార్సుల ఆధారంగా జరగడం గమనిస్తే ఇదంతా ఓ పెద్ద కార్పొరేట్ మోసంగా స్పష్టం అవుతుంది. టాటా గ్రూప్‌లకు చెందిన ట్రస్ట్‌ల నుండి ప్రధానంగా విరాళాలు పొందుతున్న ఓ పర్యావరణ సంస్థ 2020లో విడుదల చేసిన నివేదిక సిఫార్సులను బట్టి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.వాస్తవానికి గతంలో షీలా దీక్షిత్ ప్రభుత్వం సమయం నుండే ఇటువంటి ప్రతిపాదనలు వస్తున్నాయి. అయితే అప్పటి నుండి ఏ ప్రభుత్వం కూడా వీటి అమలు పట్ల ఆసక్తి చూపలేదు. కానీ, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో టాటా గ్రూప్ నుండి భారీగా విరాళాలు పొందడంతో అధికారంలోకి రాగానే ఢిల్లీ ప్రభుత్వం దీని అమలు పట్ల ఆసక్తి చూపినట్లు విమర్శలు చెలరేగుతున్నాయి. మీడియాను ప్రభావితం చేయడంలో ఇతర కార్పొరేట్ కంపెనీలకు భిన్నమైన ప్రజాసంబంధాల వ్యవస్థ టాటా గ్రూప్‌కు ఉండడంతో ఈ నిషేధం వెనుక ప్రభుత్వాన్ని ప్రభావితం చేసిన ఇటువంటి అంశాలపై మీడియాలో చెప్పుకోదగిన చర్చలు జరగలేదు. 'ఈ నిర్ణయం లక్షలాది కుటుంబాల దైనందిన జీవితాలను, జీవనోపాధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. మా ప్రభుత్వం వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి పూర్తిగా కట్టుబడి ఉంది.పరిశుభ్రమైన, స్థిరమైన రవాణాకోసం దీర్ఘకాలిక పరిష్కారాలపై పనిచేస్తోంది' అని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా తమ తప్పిదం నిర్ణయాన్ని అంగీకరిస్తూ పేర్కొనడం గమనార్హం. నిషేధం విధించే ముందు పర్యవసానాలను పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు 2018 నాటి సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావిస్తున్నది. 2018లో సుప్రీం కోర్టు తీర్పు ఢిల్లీలో 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలను, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలను నిషేధించింది. అదే విధంగా, 2014లో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఉత్తర్వు కూడా 15 సంవత్సరాల కంటే పాత వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడాన్ని నిషేధిస్తున్నది. అయితే, ఆ విధంగా మూకుమ్మడిగా ఇంధన నిషేధం సాధ్యం కాదని, సాంకేతిక సవాళ్ల కారణంగా దానిని అమలు చేయలేమని ఇప్పుడు ఢిల్లీ పర్యావరణ శాఖమంత్రి మంజిందర్ సింగ్ సిర్సా స్పష్టం చేస్తున్నారు.వాయు కాలుష్యం పర్యావరణంపై తీవ్ర దుష్ప్రభావం చూపడం, వాయు కాలుష్యంతో వాహనాల నుండి వచ్చే కాలుష్యమే ప్రధాన కారణం అవడం నిజమే అయినప్పటికీ ప్రపంచం ఎక్కడ కూడా వాహనాల వయస్సునుబట్టి వాటి కాలుష్య స్థాయిని నిర్ధారించే వరవడి లేదు. ఢిల్లీ ప్రభుత్వం విచిత్రంగా దీనిని కనుగొంది. ఢిల్లీలో, 62 లక్షల 'ఎండ్–ఆఫ్–లైఫ్' వాహనాలను లక్ష్యంగా చేసుకొని ఈ నిషేధాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దానితో నేరాలను నిరోధించలేని పోలీసులను పనికి, ఆసుపత్రులకు లేదా పాఠశాలలకు వెళ్లే వ్యక్తుల నుండి దాదాపు 200 వాహనాలను వెంబడించి స్వాధీనం చేసుకోవడానికి మోహరించారు.కేవలం ఢిల్లీలోకి ప్రవేశించడం లేదా పెట్రోల్ పంపుల వద్ద ఆగడం అనే 'నేరం' కోసం వాహనదారులను శిక్షించే ప్రయత్నం చేశారు. వారి వాహనాలను బలవంతంగా లాక్కొని పౌరులను వేధించడంతో వినూత్నమైన వేధింపులకు దిగడం ద్వారా ఢిల్లీ ప్రభుత్వం తీవ్రమైన అపఖ్యాతిని మూటగట్టుకుంది.ఈ వాహన




యజమానులలో చాలామంది కేవలం ఏడు సంవత్సరాల ఈఎంఐలను చెల్లించడం పూర్తి చేశారు. ఇప్పుడు, వారు కష్టపడి సంపాదించిన వాహనాలను 'తుక్కు వాహనాలు'గా పరిగణించడంతో దిక్కుతోచక వారంతా దిగాలుపడ్డారు. ఢిల్లీలో వాయు కాలుష్యం చాలా ఎక్కువగా ఉండడంతో గాలి నాణ్యతను పెంచేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. అంటే, ప్రభుత్వ ఆధ్వర్యంలోని కాలుష్య నియంత్రణ (పియుసి) జారీచేసే సర్టిఫికెట్లను ప్రభుత్వమే విశ్వసింపలేని పరిస్థితి నెలకొంది. అభివృద్ధి చెందిన దేశాలు తమ పాత వాహనాలను ఒక పద్ధతి ప్రకార రోడ్ల మీదకు రాకుండా నివారిస్తాయి. వాహనాలను ఉద్గార ప్రమాణాలు, రహదారి యోగ్యత తనిఖీలు చేస్తాయి. అధిక కాలుష్యం కలిగించే వాహనాలను దశలవారీగా తొలగిస్తాయి.అంతేకానీ వాహనాల వయస్సును ప్రామాణికంగా తీసుకోవు.ముఖ్యంగా అమెరికాలో వాహనం వయస్సును ప్రామాణికంగా తీసుకోరు. కాలిఫోర్నియాలో స్మోగ్ చెక్ చేసి, వాహనాలు రోడ్డు మీద తిరగాలా? వద్దా? అనేది నిర్ణయిస్తారు. లండన్, పారిస్, బెర్లిన్ లలో సైతం తక్కువ ఉద్గార మండలం (ఎల్ఈజెడ్), అతి తక్కువ ఉద్గార మండలం (యుఎల్ఇజి) ఆధారంగా పాత వాహనాలను నిషేధించడం లేదా భారీ రుసుములు వసూలు చేయడం గానీ చేస్తారు. జర్మనీలో 3 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సున్న అన్ని కార్లకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అత్యంత కఠినమైన రహదారి యోగ్యత, ఉద్గార పరీక్షలను చేస్తారు. అందులో పాస్ అయితేనే వాటిని రోడ్డు మీదకు అనుమతిస్తారు. ఢిల్లీలో 10 నుండి 15 సంవత్సరాల పాత వాహనాలకు ఇంధనం ఇవ్వొద్దని ప్రభుత్వం ఆదేశించడం దేశ రాజధానిలోని సామాన్య ప్రజలను దోచుకోవడానికి జరిగిన ఓ పెద్ద కుట్రగా మాజీ మంత్రి, ఆప్ నేత మనీష్ సిసోడియా ఆరోపించారు. 18 లక్షల కార్లు, 41 లక్షల బైక్‌లు ఢిల్లీలో ఉన్నాయని చెబుతూ మొత్తం 61 లక్షల కుటుంబాలు బిజెపి నిర్ణయం కారణంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విధానం వల్ల పేదలకు నష్టం చేకూరుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. వాహనాలను ఆధునీకరించాలని భావిస్తే, ఐరోపా, అమెరికా తరహా పద్ధతులను అవలంబించాలని, కఠినమైన, పారదర్శకమైన ఉద్గార పరీక్ష వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. గ్రీన్ జోన్లలో దశలవారీగా పాతవాహనాలను తొలగించాలని భావిస్తున్నారు. ఢిల్లీలో అమల్లోకి తేనున్న ఈ పద్ధతిని త్వరలోనే ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ అయితే అది శాస్త్రీయంగా జరగాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.ఈ నిర్ణయంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండటంతో నిషేధం అమలును నిలిపివేయక ఢిల్లీ ప్రభుత్వానికి తప్పలేదు. పలు సాంకేతిక సమస్యల వల్ల పాత వాహనాలకు ఇంధన నిషేధం కష్టసాధ్యమని గ్రహించినట్టు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా చెప్పడం గమనార్హం.అంటే, సాంకేతికమైన వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా, కేవలం కార్ల కంపెనీలకు ప్రయోజనం కల్పించడం కోసం, వారినుండి వస్తున్న ఒత్తిడుల మేరకు హడావుడిగా ప్రభుత్వం ఈ నిషేధాన్ని అమలు చేసే ప్రయత్నం చేసినట్లు స్పష్టం అవుతుంది. తమ వాహనాలను ఎంతో ప్రేమతో చూసుకునే వ్యక్తులకు కష్టం కలిగించే బదులు, సరిగా నిర్వహించని వాహనాలను స్వాధీనం చేసుకునే ఓ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలపడం ద్వారా ఏదో విధంగా ఈ నిషేధాన్ని అమలు చేసే మార్గాల గురించి అన్వేషిస్తున్నట్లు సంకేతం ఇచ్చారు. పెట్రోల్ బంకుల వద్ద ఏర్పాటు చేసిన ఎఎన్‌పిఆర్ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదని, కొత్త హై సెక్యూరిటీ ప్లేట్లను గుర్తించలేకపోతున్నాయని, వాహన వయసు ప్రకారం స్క్రాప్ చేయలేమని వెల్లడైందని మంత్రి ఈ సందర్భంగా నిషేధం అమలులో ప్రభుత్వ

# బాబును వెంటాడుతున్న జగన్ ఫోబియా!



అమరావతి,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని వైఎస్ జగన్ అనే ఫోబియా వెంటాడుతోంది. అపరిమితమైన అధికారాన్ని దక్కించుకున్న కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబునాయుడు చక్కగా చీకూచింతా లేకుండా పరిపాలన సాగించాల్సి వుంది. కానీ పరిపాలనపై కంటే జగన్‌పై ఎక్కువ దృష్టి పెట్టి, ఆయన గురించే ఎక్కువ చింతిస్తున్నట్టు బాబు తీరు చూస్తుంటే అర్థమవుతోంది.తాజాగా కేబినెట్ సమావేశంలో కూడా మంత్రులపై చంద్రబాబు చిర్రుబుర్రుఆయనలోని అసహనాన్ని తెలియజేస్తోంది. వైసీపీపై ఎందుకు విమర్శలు చేయడం లేదని ప్రశ్నించడంతో పాటు %ొ%మీ సమస్య ఏంటని మంత్రుల్ని చంద్రబాబు నిలదీశారు. ఒకవైపు ప్రభుత్వంపై వైసీపీ వ్యతిరేక ప్రచారం చేస్తుంటే, ఎందుకు తిప్పికొట్టడం లేదని చంద్రబాబు మంత్రుల్ని ప్రశ్నించారు. ఇప్పటికీ 50 శాతం మంది మంత్రులు తమ శాఖల ద్వారా చేస్తున్న మంచిపనుల్ని ప్రజల్లోకి తీసుకెళ్లలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంచిని ప్రజలకు చెప్పలేరా? అని ప్రశ్నించడంతో పాటు మీ పనితీరు బాగాలేదని ఆయన నిష్టూరమాడారు.నిజానికి చంద్రబాబు తీరుకు ఇది విరుద్ధం. తన వాళ్లను పరుషంగా మాట్లాడ్డం చంద్రబాబు స్వభావానికి విరుద్ధమని టీడీపీ నాయకులు అంటుంటారు. అయితే క్షేత్రస్థాయిలో వైసీపీకి పెరుగుతున్న ఆదరణ, ఇదే సందర్భంలో ప్రభుత్వానికి గ్రాఫ్ తగ్గుతుందన్న సంకేతాలు రావడం వల్లే, బాబులో ఎన్నడూ లేని అసహనం కనిపిస్తోందని అంటున్నారు. ఆవేశంలో సహచరుల్ని ఒక మాట అనడం, నిర్ణయాలు తీసుకోవడం ఎంత మాత్రం సరైంది కాదు.ఇక్కడే బాబు రాంగ్‌రూట్‌లో పోతున్నారనే అభిప్రాయం కలుగుతోంది. 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయంపాలైంది. ఇంతకంటే వైసీపీ రాజకీయంగా నష్టపోయేది వుండదు. ఇదే సందర్భంలో కూటమి రాజకీయంగా గరిష్టంగా లాభపడింది. ఇందుకు కారణాలు ఏవైనా కావచ్చు. ఇక ఏదైనా వుంటే, వైసీపీకి ఆదరణ పెరగడం, కూటమికి తగ్గడం అనేవి ప్రకృతి నైజం. ఈ వాస్తవాన్ని చంద్రబాబు విస్మరిస్తున్నట్టున్నారు.అధికారంలో తాముంటూ, ఇంకా వైసీపీని బద్నాం చేయలేదని మంత్రులపై సీఎం చంద్రబాబు రుసరుసలాడడం ఏ మేరకు సబబో ఆయనకే తెలియాలి. అధికారంలో ఉన్న తాము తప్ప, ప్రతిపక్షమే లేకుండా చేయాలని ఆలోచనే సరైంది కాదు. ఎందుకంటే, ఆ ధోరణి ప్రకృతి విరుద్ధం. వైసీపీపై విమర్శలు చేయడానికి మంత్రులకు వచ్చిన సమస్య ఏంటని చంద్రబాబు ప్రశ్నించడం ప్రశంసించాలి.అయితే సమాధానం తెలియనంత అమాయకుడేమీ కాదు చంద్రబాబు. మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సంపదపై పడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు కాకుండా, మరెప్పుడు సంపాదించుకోవాలనే ప్రశ్న వాళ్ల నుంచి వస్తోంది. దీంతో గుట్టుచప్పుడు కాకుండా తమకు అనుకూలమైన చోట సంపదను వెతుక్కుంటున్నారు. ఒకవేళ ప్రత్యర్థులపై ఘాటుగా విమర్శలు చేస్తే, రానున్న రోజుల్లో రాజకీయ పరిస్థితులు ఏ విధంగా వుంటాయెూ అనే భయం కూటమి ప్రజాప్రతినిధుల్ని వెంటాడుతోంది.ఇప్పుడు తాము విచ్చలవిడిగా కొల్లగొడుతూ, వైసీపీ నాయకుల్ని టార్గెట్ చేస్తే, రేపు అధికార మార్పిడి జరిగితే ఏమవుతుందో అనే భయం వారి నోళ్లను కట్టేస్తోంది. అలాగని వైసీపీపై విమర్శలే చేయడం లేదంటే, అతి ఉత్త అబద్ధం. తాను ఆశించినట్టు మంత్రులు, ఎమ్మెల్యేలు వైసీపీపై విమర్శలు చేయలేదని అంటున్నారు. చంద్రబాబు అంతరంగాన్ని పసిగట్టలేని అమాయకులెవరూ లేరు.వైఎస్ జగన్‌తో పాటు వైసీపీ నేతలపై దారుణ విమర్శలు చేస్తే, భవిష్యత్‌లో తాము వద్దనుకున్నా, ఆ పార్టీలోకి వెళ్లనివ్వని పరిస్థితి కల్పించాలనేది చంద్రబాబు ఎత్తుగడ. చంద్రబాబు ఉద్దేశాన్ని గుర్తించిన టీడీపీ నేతల్లో ఎక్కువ మంది%ొ% ముందు చూపుతో సీఎం కోరుకున్నట్టుగా నోరు పారేసుకోడానికి సిద్ధపడడం లేదు. ఇదే చంద్రబాబుకు అసలు మింగుడుపడడం లేదు. తాము ఛీ కొట్టినా, గత్యంతరం లేక టీడీపీలోనే వుండాలని చంద్రబాబు ఆశ. అయితే తామెందుకు వ్యక్తిగత వైరం పెట్టుకోవాలని మంత్రులు, ముఖ్యంగా టీడీపీ ప్రజాప్రతినిధుల ఆలోచనగా వుంది. ఈ పరిణామాలన్నీ చంద్రబాబును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.ఏడాది క్రితం దక్కిన ఘన విజయం కంటే, నాలుగేళ్లలో రానున్న ఎన్నికల్లో ఏమవుతుందో అనే బెంగ ఆయనకు మనశ్శాంతిని కరువు చేస్తోంది. మరీ ముఖ్యంగా జగన్ మళ్లీ అధికారంలోకి వస్తాడేమో? అదే జరిగితేఆ ఊహే చంద్రబాబును తీవ్రంగా భయపెడుతోంది. ఆ భయంలో చంద్రబాబు ఏవేవో మాట్లాడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై చిందులు తొక్కుతున్నారు. రేపటిపై భరోసా లేకపోతే, కలిగే దుష్పరిణామాలకు ఈ లక్షణాలే నిదర్శనం.

# నైపుణ్యాలు ఉంటున్నా..ఆవిష్కరణలు ఏవీ

న్యూఢిల్లీ,దేశీయ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అసరముందని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత విద్యావిధానానికి అద్దం పడుతున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యా ప్రపంచానికి వెలుగుదివ్వెగా ఉండేది. విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి చేసేలా శిక్షణ ఉండేది. కేవలం చదువలే గాకుండా అన్నిరంగాల్లో ఆరితేరేలా చేసేది. గురుకుల విద్యా విధానంలో అలాంటి అద్భుతాలు ఉండేవి. ఆనాడే అందరికీ ఒకే తరహా విద్యావిధానం అమల్లో ఉండేది. నేటి విద్యావిధానంలో మన నైపుణ్యాలు కానరావడం లేదు. సాంకేతికంగా బలంగా ఉంటున్నా ఎందుకనో అద్భుతాలు సాధించడం లేదు. ఐఐటిలు,ఐఐఎంల నుంచి వస్తున్న విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉంటున్నా, ఆవిష్కరణలు రావడం లేదు. ప్రతిదానికి మనం విదేశీ నైపుణ్యాలపై ఆధారపడుతున్నాం. బ్రిటిషర్ల పాలన మొదలయ్యాక మన గురుకులాలను పాతరేశారు. మెకాలే తరహా విద్యావిధానం పట్టుకుని మనం ఇంకా పాకులాడడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరగడం లేదు. దీనికితోడు విద్యార్థులను మానసిక ఆందోళనకు గురి చేస్తోంది. ఒత్తి పరీక్షల్లో పడి విద్యార్థులు అసువులు బాస్తున్నారు.ఇదే విషయాన్ని ప్రధాని సహా మేధావులు కూడా అంగీకరిస్తున్నారు. అయితే దీనిని మార్చే ప్రక్రియను చేపట్టడం ద్వారా భారతీయ విద్యను అంతర్జాతీ స్థాయిలో పోటీపడేలా చేయాలి. బ్రిటీష్ వాళ్లు తమ అవసరాలను తీర్చుకోవడానికి అనుగుణంగా బానిస వర్గాన్ని సృష్టించే విద్యా విధానాన్ని దేశంలో అమలు చేశారు. జాతీయ విద్యా విధానం అమలుకు సంబంధించి జరుగుతున్న ప్రయత్నాలను వేగవంతం చేయాలి. కేవలం డిగ్రీ పట్టాలను అందిచడమే కాకుండా దేశాన్ని ముందుకు నడిపే మానవ వనరులను అదించేలా విద్యా వ్యవస్థ ఉండాల్సి అవసరం గుర్తించాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఇంకా చాలా మార్పులు చేయాల్సిన అవసరముంది. ఇప్పుడు పిల్లలంతా ఇతరులపై పోటీ పడేందుకు గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రతిదీ గూగుల్‌లో సర్చ్ చేయడం అలవాటు చేసుకున్నారు. శారీరక శ్రమతో పాటు మానసిక ధృఢత్వాన్ని ప్రస్తుత విద్యావిధానంలో అమలు కావడం లేదు. మన విద్యా ప్రాంగణాలలో అలాంటి పిల్లలకు అవసరమైన వాతావరణం కల్పించాల్సి ఉంది. ఎన్ఇపి ద్వారా భారతీయ భాషల్లో విద్యనభ్యసించేందుకు తలుపులు తెరుచుకోవాలి. ప్రపంచ విద్యాభ్యాస గమ్యస్థానంగా భారత్ ఎదిగేలా చేయాలి. ఎంతసేపూ మనం విదేశాలకు వెళ్లకుండా మనవద్దకే వచ్చేలా చేయగలగాలి. అప్పట్లో వలస పాలకుల సొంత అవసరాలు తీర్చుకోవడమే ఆ విద్యా వ్యవస్థ లక్ష్యంగా మారింది. ఇప్పటికీ చాలా వరకు మార్పు లేకుండానే అది కొనసాగుతోంది. విద్యావ్యవస్థ అంటే కేవలం డిగ్రీ హోల్డర్లను ఉత్పత్తి చేయడమే కాదు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన మానవ వనరులను అందించాలన్న లక్ష్యం కావాలి.డిగ్రీల కోసం కాకుండా, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌గా తమను తాము రూపొందించుకునేందుకు యువత సిద్ధం కావాల్సి ఉంది. విద్యా వ్యవస్థను సంకుచిత ఆలోచనల నుంచి బయటికి తీసుకురావాలి. అప్పుడే మన లక్ష్యం నెరవేరగలదు. అందుకు మానవవనరులను అభివృద్ధి చేసే విద్యావిధానం రావాల్సి ఉంది. చదువు ఏదయినా స్వశక్తితో నిలబడగలిగేలా పౌరులను తీర్చిదిద్దగలగాలి.

# కార్పొరేట్ కంపెనీలకు దాసోహం

చీరాల, కార్మికులను బానిసలుగా మార్చి వారి హక్కులను హరించి కార్పొరేట్ కంపెనీ యజమానులకు లాభాలు చేకూర్చేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ చట్టాలను అమల్లోకి తీసుకు వస్తున్నాయని, వీటిని కార్మికులు అందరూ ఐక్యంగా ఉద్యమించి అడ్డుకోవాలని ఏపీ ఐ ఎల్ టి డి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మి అన్నారు. లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ కార్మికుల హక్కులను కాపాడాలని దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం చేపట్టిన ఏపీ ఫెడరేషన్ సిఐటియు, టి ఎన్ టి యు సి, ఐఎన్ టియుసి, వై ఎస్ ఆర్ టియుసి నాలుగు యూనియన్లు ఐక్యంగా స్వచ్ఛందంగా కలసి సమ్మెలో పాల్గొని చీరాల ఐటిసి వద్ద చేపట్టిన సమ్మెను విజయవంతం చేశారు. కార్మికులు సమ్మె ప్రభావంతో చీరాలలో ఐటిసి కంపెనీ మూతపడింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మంజూందర్ లు మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చేందుకు లేబర్ కోర్సు అమల్లోకి కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుంది అన్నారు. కార్మికులకు ఉన్న 44 చట్టాలను హరించి వాటిని నాలుగు చట్టాలుగా మార్చారు అన్నారు. యజమానులకు లాభాలు కలిగించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమల్లోకి తీసుకువస్తుందని ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కార్మికులందరూ ఐక్యంగా కలిసి పోరాటాలు చేయాలన్నారు. వంద సంవత్సరాల క్రితం కార్మిక సంఘాలు లేకపోయినప్పటికీ సమ్మె హక్కుతోపాటు– ఎనిమిది గంటల పని దినం సాధించగలిగాం అని అయితే నేడు కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్లను తీసుకువచ్చింది అని అన్నారు. ఈ కోడ్ల అమలుతో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులన్నీ కోల్పోతారు అన్నారు. స్వాతంత్ర్యం రాకముందే కార్మికులు విదేశీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణ త్యాగాలు చేశారు అన్నారు. లేబర్ కోడ్స్ చట్టాలను చీకట్లో తీసుకువచ్చిన మోడీ ప్రభుత్వానికి కార్మికుల జీవితం విలువ లేనిది అని అన్నారు.కనీస వేతన చట్టం చేయని ఈ ప్రభుత్వం ప్రస్తుతం ఎనిమిది గంటల పని సమయాన్ని 12 గంటలుగా పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. అనంతరం ఐటిసి వద్ద కార్మికులు ర్యాలీ నిర్వహించారు.అదేవిధంగా చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం వసంతరావు, ఏపీ ఫెడరేషన్ సిఐటియు,టిఎన్ టియుసి,ఐఎన్ టియుసి,వై ఎస్ ఆర్ టియుసి నాలుగు యూనియన్లు అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

## ఏసిబి వలలో మహిళా అధికారి

హైదరాబాద్, రాష్ట్రంలో ఏసీబీ దూకుడు పెంచింది. వేలకు వేలు జీతాలు వస్తోన్న అడ్డదారుల్లో లంచాలు తీసుకుంటున్న అవినీతి అధికారుల భరతం పడుతోంది. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులకు మరో అవినీతి అధికారి చిక్కారు. పని మీద వచ్చిన ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మాదాపూర్ సర్కిల్ డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్‌గా పని చేస్తోన్న సుధా ఓ కంపెనీకు సంబంధించిన జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ చేయడానికి వచ్చిన వ్యక్తిని రూ.8 వేలు లంచం డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఈ మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు హైదరాబాద్ నాంపల్లిలోని గగన్ విహార్‌లో సదరు వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా సుధాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గగన్ విహార్‌లో తనిఖీలు చేశారు. నిందితురాలు సుధాపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల ఏసీబీకి చిక్కుతున్న వారిలో ఎక్కువగా మహిళా ఆఫీసర్లు ఉండటం గమనార్హం.

# వ్యవసాయంపై కృత్రిమ మేధ ప్రభావం

న్యూఢిల్లీ, ప్రపంచవ్యాప్తంగా నేడు ప్రతి రంగాన్నీ కృత్రిమ మేధ ప్రభావితం చేస్తోంది. వ్యవసాయ రంగంలోనూ ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. రాబోయే రోజుల్లో సాగు స్వరూపాన్ని ఏఐ పూర్తిగా మార్చివేసేలా ఆవిష్కరణలు జరుగుతున్నాయి. అనేక దేశాలు యాంత్రీకరణను దాటుకుని స్మార్ట్ వ్యవసాయం వైపు పరుగులు తీస్తున్నాయి. ఇండియాలోనూ అటు వైపు అడుగులు పడుతున్నాయి. కృత్రిమ మేధ, డేటా ఆధారిత పరిష్కారాలు సాగులో కొత్త శకానికి నాంది పలుకుతున్నాయి. 1960ల్లో వచ్చిన హరిత విప్లవంతో దేశీయంగా ఆహారోత్పత్తి గణనీయంగా పెరిగింది. అదే సమయంలో నీటికొరత, విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వంటి సవాళ్లను సాగురంగం ఎదుర్కొం టోంది. వీటికితోడు పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి, భవిష్యత్ తరాలకు ఆహారభద్రతను అందించడానికి కృత్రిమ మేధ, బిగ్‌డేటా అనలిటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలు ఉపయోగపడతాయి. వ్యవసాయంలో స్థిరత్వం సాధించటానికి ఏఐ ముఖ్య సహాయకారిగా మారుతోంది. డ్రోన్లు, సెన్సర్లు తదితరాల ద్వారా రైతులు నేల ఆరోగ్యం, వాతావరణ పరిస్థితులు, పంట పెరుగుదల, తెగుళ్ల గురించి తెలుసుకోవచ్చు. ఈ సాంకేతికతలు వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి, నీటిపారుదల, పంటల రక్షణకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడతాయి. ఏఐ ఆధారిత ముందస్తు విశ్లేషణల సాయంతో మార్కెట్ పోకడలను తెలుసుకొని, నష్టాలను తగ్గించుకోవచ్చు. నేల స్వభావం, పంట రకాలు, పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను ఏఐ సాంకేతికత సూచిస్తుంది. వాటిద్వారా పర్యావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంతోపాటు- పంటల ఉత్పాదకతను పెంచుకోవచ్చు. ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లు, మొబైల్ యాప్‌లతో ఉత్తమ వ్యవసాయ విధానాలను అన్నదాతలకు తెలియజెప్పవచ్చు. సహజవనరుల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో ఏఐ, డేటా అనలిటిక్స్ కీలకపాత్ర పోషిస్తాయి. ఉపగ్రహ చిత్రాలు, భౌగోళిక సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా అటవీ నిర్మూలన, నేల క్షీణత, నీటి కాలుష్యాన్ని పర్యవేక్షించ వచ్చు. పర్యావరణ వ్యవస్థలను, జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ఇవి తోడ్పడతాయి. ప్రపంచ జనాభా 2050 నాటికి వెయ్యి కోట్లకు చేరుతుందని అంచనా. పెరిగే జనాభాకు అనుగుణంగా పంట దిగుబడులను సాధించాలి. ఆహార కొరతను అధిగమించడానికి ఉత్పాదకతను పెంచడమే పరిష్కారం. ఈ విషయంలో ప్రపంచంలోని చాలా దేశాలు అనేక సవాళ్లు ఎదుర్కొంటు-న్నాయి. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం వల్ల విత్తనాలు విత్తడానికి సరైన సమయాన్ని నిర్ణయించడం రైతులకు సవాలుగా మారింది. కృత్రిమ మేధ సహాయంతో కర్షకులు వాతావరణ పరిస్థితులను విశ్లేషించవచ్చు.?మన దేశంలో వ్యవసాయంలో ఏఐ, డేటా ఆధారిత అనువర్తనాలను విస్తృతంగా ఉపయోగించడానికి ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశోధనా సంస్థలు, వ్యవసాయ సంఘాల సమష్టి కృషి అవసరం. ఇండియాలో ఎక్కువమంది చిన్న, సన్నకారు రైతులే. తమకున్న చిన్న కమతాల్లో ఆధునిక పరికరాలను వినియోగించడం వారికి సమస్యగా మారింది. భవిష్యత్తులో సాగు మొత్తం ఏఐ కేంద్రంగానే జరిగే అవకాశం ఉంది. దానికి అనుగుణంగా వ్యవస్థలను సమాయత్తం చేయడం ప్రభుత్వాల కర్తవ్యం. ఇంకా 50 శాతం పైగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల ఈ రంగంలో ఎంతగా ప్రోత్సాహం దక్కితే అంతగా పురోగతి లభిస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతంగా ఉంటుంది.

## నటులు శ్రీకాంత్,కృష్ణలకు బెయిల్

చెన్నై, డ్రగ్స్ కేసులో నటులు శ్రీకాంత్, కృష్ణకు మద్రాస్ హైకోర్ట్ షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. చిత్ర పరిశ్రమలో కలకలం రేపిన డ్రగ్స్ కేసులో నటులు శ్రీకాంత్, కృష్ణకు మద్రాస్ హైకోర్ట్ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. డ్రగ్స్ సేవించిన ఆరోపణలతో గత జూన్‌లో శ్రీకాంత్, కృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరి వ్యక్తిగత బెయిల్ పిటిషన్లపై బుధవారం మద్రాస్ హైకోర్టులో విచారణ జరిగింది. మరోవైపు, ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది. జూన్ 23వ తేదీన శ్రీకాంత్‌ను చెన్నై నగరంలోని డ్రగ్ నెట్‌వర్క్‌లో పాలుపంచుకున్నారనే ఆరోపణలతో నంగనల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారం రోజుల తర్వాత కృష్ణ, ఆయన సహచరుడిని కూడా అదే కేసులో బ్యాంక్ లావాదేవీలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేశారు. మద్రాసు హై కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో నటు-లు శ్రీకాంత్, కృష్ణ విడదల అయ్యారు.

## పంచాయితీకి తెరపడినట్లేనా?

హైదరాబాద్,ఓరుగల్లు కాంగ్రెస్ పంచాయితీ మొన్నటి వరకు హాట్ టాపిక్‌గా కొనసాగింది. రాష్ట్ర వ్యవహాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లురవి దగ్గరకు వ్యవహారం వెళ్లింది. అయినా రెండు వర్గాలు తగ్గకపోవడంతో ఫైనల్‌గా మ్యాటర్ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి చేరడంతో ఇటు కొండాతో అటు ఎమ్మెల్యేలతో మాట్లాడి సెట్ చేశారని టాక్. కొండా దంపతులు..ఓరుగల్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి వేర్వేరుగా మాట్లాడాంట. దీంతో సవాళ్లు,ప్రతి సవాళ్లు చేసుకున్న నేతలు ఇప్పుడు తమ పార్టీ ఇంటర్నల్ మ్యాటర్ అంటున్నారు. ఒకానొక దశలో కడియం, రేవూరి, నాయిని రాజేందర్‌రెడ్డి లాంటి ఎమ్మెల్యేలు తాము కావాలో..కొండా ఫ్యామిలీ కావాలో తేల్చుకోవాలంటూ ఇంచార్జ్‌కు అల్టిమేటం జారీ చేశారు. క్రమశిక్షణ కమిటీ ముందు కూడా తమ వాదన బలంగా వినిపించారు. కానీ సీఎం రేవంత్ ఎంట్రీతో అంతా చల్లబడ్డారట. ఒకవైపు ఎమ్మెల్యేలతో.. మరోవైపు మంత్రి కొండా సురేఖ, కొండా మురళితో సీఎం స్వయంగా మాట్లాడారు. కొండా మురళితో దాదాపు గంటకు పైగా సీఎం సమావేశమై సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందిగా కోరారట. పంచాయితీ ఇలాగే కొనసాగితే.. త్వరలో రాబోయే లోకల్ బాడీ ఎన్నికలపై ఎఫెక్ట్ పడే ప్రమాదం ఉందని.. రెండు వర్గాలకు నచ్చజెప్పారట. కొండా మురళి కూడా సీఎం స్వయంగా పిలిపించుకొని మాట్లాడటంతో..తమ ప్రయత్నమంతా పార్టీ కోసమే..అలాంటప్పుడు పార్టీకి డ్యామేజ్ చేస్తామా అంటూ సైలెంట్‌గా ఉండేందుకే ఓకే చెప్పారట. ఎమ్మెల్యేలు కూడా కూల్ అయిపోయారు. కొండా మురళికి భయపడుతున్నామా బొంగేం కాదంటూ మాట్లాడిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి..ఇప్పుడు తమ పార్టీ ఇంటర్నల్ వ్యవహారం మేం, మేం చూసుకుంటామంటూ కూల్ డౌన్ అయ్యారట. ఈ ఓవరాల్ ఎపిసోడ్‌లో కొండా ఫ్యామిలీ పైచేయి సాధించిందనేది గాంధీభవన్ టాక్. వరంగల్ పాలిటిక్స్‌లో ఎమ్మెల్యేలుగా మేం కావాలో లేక కొండా ఫ్యామిలీనో తేల్చుకోవాలని ఎమ్మెల్యేలు పార్టీకి అల్టిమేటం జారీ చేసిన తర్వాత కొండా ఫ్యామిలీపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఊహాగానాలు వినిపించాయి. ఇలా ఈ వ్యవహారం కూల్ కావడంతో మరోసారి ఓరుగల్లు కాంగ్రెస్‌లో కొండా పైచేయి సాధించారనే టాక్ నడుస్తోంది.

పలువురు ఎమ్మెల్యేల గెలుపులో కొండా మురళి పాత్ర..

తమ కుటుంబం మీద వ్యతిరేక గ్రూపు చేస్తున్న ఆరోపణలు, విమర్శలను రేవంత్ దగ్గర ప్రస్తావించారు కొండా సురేఖ. అయితే కొండా ఫ్యామిలీకి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడొద్దని జిల్లాలోని ఎమ్మెల్యేలకు చెప్పాలని పీసీసీ చీఫ్‌ను ఆదేశించారట సీఎం రేవంత్. కొండా ఫ్యామిలీ అండ పార్టీకి వరంగల్ జిల్లాలో చాలా అవసరం అని అన్నారట.

# గులాబీ సంస్థాగతం ఊసేది? డిజిటల్ సభ్యత్వాలని ఇప్పటికి రెండు నెలలు!

హైదరాబాద్, బీఆర్ఎస్ పార్టీలో సంస్థాగత ఎన్నికల నిర్వహణ ఎప్పుడు చేపడుతారన్న అంశంపై గులాబీ కార్యకర్తలు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ఓ వైపు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి కొనసాగుతున్నది. పీసీసీ కమిటీలను పూర్తి చేసుకున్న ఆ పార్టీ.. జిల్లా, బ్లాక్, మండల, గ్రామస్థాయి కమిటీల ఏర్పాటులో నిమగ్నమైంది. ఇందుకోసం ఇప్పటికే ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను సైతం నియమించింది. అటు బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో బూత్, గ్రామ, మండల, జిల్లా కమిటీల ఎన్నికతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎంపిక కూడా పూర్తి చేసుకుంది. ఈ నెలలో పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీ ఏర్పాటుకు కమలనాథులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీజేపీల సంస్థాగత ఎన్నిక ప్రక్రియ తుది దశకు చేరుకోగా.. బీఆర్ఎస్‌లో మాత్రం సంస్థాగత ఎన్నికల ఊసు వినబడకపోవడం రాజకీయ విశ్లేషకులను సైతం అశ్చర్యపరుస్తున్నది. ప్రాంతీయ పార్టీ.. అందునా కుటుంబ ఆధిపత్యంలోని పార్టీగా ఉన్న బీఆరెస్‌లో సంస్థాగత ఎన్నికల వ్యవహారంపై ప్రశ్నించడం కాదు సరికదా.. కనీసం ప్రస్తావన చేసే సాహసానికీ ఎవరూ పూనుకోని నేపథ్యంలో కేసీఆర్ కుటుంబం ఏక నాయకత్వమే చెల్లుబాటు అవుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సంస్థాగత నిర్మాణం లేకుండా పార్టీని ఎంతకాలం నడిపిస్తారన్న ప్రశ్న క్యాడర్ నుంచి కూడా వినిపిస్తున్నది. రాష్ట్రంలో అధికారం కోల్పోయి ఏడాదిన్నర గడిచినా.. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్కటి కూడా గెలుచుకోకపోయినా.. ఇంకా పార్టీ నిర్మాణంపై అధినాయకత్వం దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ విలీనం ప్రతిపాదనలు తెచ్చారన్న కేసీఆర్ కూతురు కవిత మాటలను ప్రస్తావిస్తున్నకొందరు.. వేరొక పార్టీలో విలీనమయ్యేదానికి ఇంక సంస్థాగత నిర్మాణం ఎందుకనుకున్నారా? అన్న సెటైర్లు కొందరి నుంచి వెలువడుతున్నాయి.

మేనెల మొదటి వారంలోనే అంటూ ఆర్భాటం

గత ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ సభకు జనసమీకరణ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. క్యాడర్‌లో జోష్ నింపేందుకు ప్రయత్నించిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రజతోత్సవ సభ ముగిశాక మే మ్నెదటి వారం నుంచి సభ్యత్వం నమోదు చేపడుతామని ప్రకటించారు. సభ్యత్వాలు కూడా డిజిటల్ రూపంలో ఉంటాయని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు సహా అనుబంధ సంఘాల కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆక్టోబర్‌లో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్త కేంద్రంగా పార్టీ నిర్మాణం జరుగుతుందని గొప్పగా చెప్పారు. కమిటీల ఏర్పాటు తర్వాత జిల్లాల వారీగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని కూడా చెప్పారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తయితే కనీసం పార్టీ పదవులైనా దక్కుతాయన్న ఆశావహులలో కేటీఆర్ ప్రకటన ఆశలు రేపింది. కానీ రజతోత్సవ సభ ముగిసిపోయి రెండున్నర నెలలు గడిచిపోయినా మళ్లీ కేటీఆర్ నోటి నుంచి పార్టీ సంస్థాగత ఎన్నికల



ఊసు వినిపించకపోవడంతో వారంతా ఇంకెప్పుడా? అని ఎదురుచూస్తున్నారు.

గ్రామం నుంచి రాష్ట్ర కమిటీ దాక కార్యవర్గాలు ఖాళీ

ఏ రాజకీయ పార్టీ మనుగడకైన సైద్ధాంతిక పునాది, సంస్థాగత నిర్మాణం కీలకం. బీఆర్ఎస్‌కు సైద్ధాంతిక పునాది తెలంగాణ నినాదమే. తెలంగాణ అభివృద్ధి, దాని హక్కుల కోసమే పోరాడుతున్నానని చెబుతూ ఉంటుంది. బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్న పిదప పార్టీలో తెలంగాణ ఆత్మ కొరవడిందన్న విమర్శలు వచ్చాయి. ఇక సంస్థాగతం ప్రక్రియ చూస్తే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో సక్రమంగానే సాగిన గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల ఎన్నికలు పార్టీ అధికారంలోకి వచ్చాక గాడి తప్పాయి. పార్టీ రాష్ట్ర కమిటీని చివరి సారిగా 2017లో ప్రకటించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి అధికారంలోకి వచ్చాక సంస్థాగత ఎన్నికల ప్రక్రియను కేసీఆర్ పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతోనే పార్టీని నడిపిస్తున్నారు. మధ్యలో 2021లో గ్రామ, మండల కమిటీలను వేశారు. 2022లో 33జిల్లాలకు జిల్లా అధ్యక్షులను ప్రకటించినప్పటికి జిల్లా కార్యవర్గాలు.. అనుబంధ కమిటీల నిర్మాణాలను విస్మరించారు. ఇక అప్పటి నుంచి సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం గులాబీ క్యాడర్ ఎదురుచూస్తున్నది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల పెత్తనం ఇష్టంలేని వారంతా వారి గెలుపు కోసం పనిచేయకపోవడం కూడా పార్టీ ఓటమికి ఒక కారణమన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఆ ధోరణి పార్లమెంటు ఎన్నికల్లో మరింత పెరిగింది. అధికారం కోల్పోయాకైనా ఆత్మవిమర్శ.. అంతర్మథనంతో పార్టీ ప్రక్షాళన.. పునర్నిర్మాణం చేస్తారనుకున్న వారికి ఎప్పటిలాగే నిరాశే ఎదురవుతోందని పార్టీ వర్గాలు వాపోతున్నాయి. పార్టీ పదవులైనా లేకుండా ఖర్చులు పెట్టుకుని పార్టీని నడిపించడం ఎందుకన్న స్తబ్దత క్యాడర్‌ను ఆవహించిందని కొందరు నాయకులు ప్రైవేట్ సంభాషణల్లో చెబుతున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో బీఆర్ఎస్ అధిష్ఠానం పార్టీ సంస్థాగత పదవులను భర్తీ చేస్తుందా? లేక స్థానిక ఎన్నికలు ముగిశాకే నిర్వహిస్తారా అన్న గందరగోళం పార్టీ క్యాడర్‌లో నెలకొంది.

# విలీనం..ప్రయోజనం శూన్యం




కరీంనగర్ : కరీంనగర్‌లో శివారు గ్రామ పంచాయతీలను విలీనం చేయడంతో ఎలాంటి ప్రయోజనం లేదని విలీన గ్రామాల (డివిజన్ల) ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు వారికి ఆశించిన ప్రయోజనం కల్పించకపోగా పన్నుల భారం మోపుతూ ఎప్పటికప్పుడు గ్రామాలను విలీనం చేస్తూనే వస్తుంది. నగరీకరణ పేరుతో గ్రామాలను విలీనం చేస్తుండడంతో ప్రజలు తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు.

1984 నుంచి గ్రామాల విలీనం

నాలుగు దశబ్దాల క్రితం 1984లో ఆనాటి రాంనగర్, రాంపూర్ గ్రామ పంచాయతీలను కరీంనగర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ 32 వార్డులతో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా మార్చింది. ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీలోని వార్డులు అభివృద్ధికి నోచుకోలేదు. నేటికి ఆ ప్రాంత ప్రజలు మున్సిపాలిటీ కంటే గ్రామ పంచాయతీ సేవలే ముద్దుగా ఉండేవని మున్సిపాలిటీలో విలీనంతో పన్నుల భారం పడిందని, సమస్యలు పెరిగాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2005లో రెండు దశబ్దాల క్రితం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా చేసేందుకు అవసరమైన జనాభా, విస్తీర్ణం లేక పోయినప్పటికి ఆనాటి ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లతో ప్రభుత్వం నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేసింది. 50డివిజన్లతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రకటించారు. నగరం నలుదిశలా విస్తరిస్తూ వచ్చింది. నాటి రాంపూర్, రాంనగర్ గ్రామ పంచాయతీలోని విలీన డివిజన్లలో నేటికీ అనేక ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదు. 2019 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పద్మనగర్, రేకుర్తి, ఆరపల్లి, సీతరాంపూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, అలుగునూర్, సదాశివపల్లి ఏడు గ్రామాలను కార్పోరేషన్‌లో విలీనం చేశారు. దీంతో నగరం విస్తీర్ణం జనాభా విపరీతంగా పెరిగింది. ఆయా విలీన గ్రామాల వరకు కాలనీలు విస్తరించాయి. విస్తరణకు అనుగుణంగా నిధులను విడుదల చేయకపోవడం ఉద్యోగులు, కార్మికులను నియమించకపోవ డంతో నేటికి ఈ ఏడు గ్రామాల్లోని అనేక ప్రాంతాల్లో పల్లె వాతావరణమే కనిపిస్తుంది. రోడ్లు, డ్రైనేజీలు, మురికి నీటి కాలువలు, మంచినీటి వసతి, వీది దీపాల వంటి మౌలిక వసతులు ఆశించిన మేరకు కల్పించలేదని తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. విలీనం వద్దు బాబోయ్ అంటూ ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించినప్పటికి వారి అభిప్రాయాలను పట్టించుకోలేదు. దీంతో ఈ ఐదేళ్లలో ఒరిగిందేమి లేదని, పన్నుల భారం, వ్యయ ప్రయాసలు చివరకు జనన మరణ ధృవీకరణ పత్రాలకు కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మరోసారి రాష్ట్ర ప్రభుత్వం కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను విలీనం చేసింది. ఈ గ్రామాల ప్రజలు కూడా విలీనంతో ఉపాధి హామి పనులు కోల్పోతామని, ఇప్పటికే విలీన గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని, తమ గ్రామాలను విలీనం చేయవద్దంటూ ప్రభుత్వాన్ని వేడుకున్నారు. వారి అభ్యంతరాలను పక్కన పెట్టి కార్పొరేషన్‌లో కలిపి 60 డివిజన్లను 66 డివిజన్లుగా చేశారు. దీంతో కార్పోరేషన్ విస్తీర్ణం, జనాభా గణనీయంగా పెరిగిందే కానీ, వారికి ఒరిగిందేమి లేదు.

ముదునాళ్ల ముచ్చటగా కొత్తపల్లి మున్సిపాలిటీ

కొత్తపల్లి మేజర్ గ్రామ పంచాయతీని 2020లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో గ్రామం పట్టణంగా మారి వేగంగా అభివృద్ధి చెందుతుందని అక్కడి ప్రజలు ఎంతో ఆశపడ్డారు. మున్సిపాలిటీగా మార్చిన తరువాత ఎన్నికలు నిర్వహించి పాలక వర్గానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో ఆశించిన అభివృద్ధి జరగలేదు. మరో ఐదేళ్లకైనా అభివృద్ధి జరుగుతుందని మొట్ట మొదటి పాలకవర్గ సభ్యులు, ప్రజలు ఆశించారు. ఊహించని విదంగా ఐదేళ్లకే కొత్తపల్లి మున్సిపాలిటీని రద్దు చేస్తూ కరీంనగర్ కార్పోరేషన్‌లో విలీనం చేశారు. కార్పొరేషన్‌లో విలీనం అయిన తరువాత ఆఘమేఘాలపై మున్సిపాలిటీ ఆస్తులను, రికార్డులను స్వాదీనం చేసుకున్నారే తప్ప ప్రత్యేకంగా ఇచ్చిన నిధులంటూ ఏమి లేదు. దీంతో అక్కడి ప్రజలు మున్సిపాలిటీని రద్దు చేసి కార్పొరేషన్‌లో చేర్చినందున ఇంటి పన్నులు, ఇంటి అనుమతుల ఫీజులు పెరుగుతున్నాయే తప్ప ఒరిగిందేమి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విలీనంపై దృష్టి సారించకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే..

కార్పోరేషన్ పరిధిని పెంచుతూ గ్రామాలను విలీనం చేస్తున్న ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎన్నికలకు ముందే ప్రత్యేక అధికారి పాలనలో విలీన డివిజన్లు, శివారు గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బ తీసేలా కుట్రలు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బ తీసేలా వివిధ సంస్థలకు ఈ మెయిల్స్ పెట్టడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. పెట్టుబడులు అడ్డుకునేలా వైసీపీ చేస్తున్న కుట్రలపై విచారణ చేయిస్తామని సీఎం ప్రకటించారు. బుధవారం నాడు అమరావతిలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో వైసీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ.. పెట్టుబడులు అడ్డుకునేలా ఆయా సంస్థకు మెయిల్స్ చేస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఏపీఎండీసీ జారీ చేసిన బాండ్లల్లో పెట్టుబడులు పెట్టొ-ద్దంటూ ఏకంగా 200 దేశ, విదేశీ కంపెనీలకు తప్పుడు ఈ మెయిళ్లు పెట్టారని ఆర్థిక మంత్రి పయ్యావుల సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీనే తమ పార్టీ సానుభూతిపరులతో ఈ మెయిళ్లు పెట్టించిందని సీఎంకు ఆధారాలు చూపించారు పయ్యావుల. తప్పులు చేసి.. ఆ తప్పులను ప్రత్యర్థుల మీదకు నెట్టేయడమనే కుట్రలను మొదటి నుంచి వైసీపీ అమలు చేస్తూనే ఉందన్నారు సీఎం. నిధులు రాకుండా తెర వెనుక అడ్డుకోవడం.. పథకాలు అమలు చేయడం లేదని ప్రజల్లో దుష్ప్రచారం చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మంత్రులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా 200 కంపెనీలకు ఈ మెయిళ్లు పెట్టడాన్ని సీరియస్‌గా తీసుకోవాలని పలువురు మంత్రులు కోరారు. దీనికి స్పందించిన సీఎం.. ఏపీ బ్రాండ్ దెబ్బ తీసేలా ఈ మెయిళ్లు పెట్టిన అంశంపై విచారణకు ఆదేశిస్తామన్నారు. మామిడి రైతుల విషయంలోనూ వైసీపీ ఇదే విధంగా తప్పుడు అంశాలను దుష్ప్రచారం చేస్తోందన్నా సీఎం. అమరావతికి నిధులు రాకుండా తప్పుడు ఫిర్యాదులు చేసిందని ఈ సందర్భంగా పలువురు మంత్రులు గుర్తు చేశారు.

# తొలి అడుగులో..సమస్యల వెల్లువ

అమరావతి,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు పుంఖానుపుంఖాలుగా సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే. అయితే ఏ మేరకుచిత్తశుద్దితో ముందుకు వెళతారన్నది ముఖ్యం. ఇటీవల వారసత్వ మార్పిడి విషయంలో వచ్చిన దరఖాస్తులే ఇందుకు నిరదర్శనం. ఈ సమస్య సరిష్కారం కోసం ప్రభుత్వం సక్సెసేషన్ కార్యక్రమం చేపట్టబోతున్నది. ఇందులో వంద రూపాయలకే తండ్రి నుంచి సంక్రమించిన హక్కులకు పట్టా లభించబోతున్నది. అలాగే ఇల్లు తదితర సమస్యలుకూడా ఇలాగే ఉన్నాయి. వీటిని కూడా పరిష్కరించాలని కోరుతున్నారు . సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే స్థానిక ఎన్నికల్లో తీవ్రప్రభావం చూపగలదు. దీనిని దృష్టిలో ఉంచుకునే టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి తొలి అడుగు కార్యక్రమాన్ని రూపొందించారని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఇళ్లు, ఇంటి స్థలాలు, తాగునీరు, వైద్యం, రోడ్లు, వ్యవసాయానికి సాయం వంటి అంశాలపైనే ఎక్కువగా వినతులు ఉన్నట్లు- నియోజకవర్గ ఇన్చార్జీలు చెబుతున్నారు. గైర్హాజరుకు అవకాశం లేకుండా ఇంటింటికీ నేతలు, కార్యకర్తలు వెళ్లాల్సిన సమయంలో ఎవరూ గైర్హాజరు కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రతి ఇంటికీ ఒక లోకేషన్ చొప్పున ఫీడ్ చేసిన ట్యాబ్లను నేతలకు ఇస్తున్నారు. ఒక ఇంటి పర్యటన పూర్తయిన తరువాతే మరో ఇంటి వివరాలు ట్యాబ్లో కనిపించేలా రూపకల్పల చేయడం విశేషం. అలాగే ఒక్కో ఇంటికి మూడు నిముషాల సమయం ఇస్తున్నారని, రోజుకు కనీసం 30 ఇళ్లకు వెళ్లేలా కార్యక్రమాన్ని రూపొందించారని తెలిసింది. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రతి ఎంఎల్ఎను ఇంటింటికి వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్దేశిరచారని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రులతో పాటు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు క్షేత్రస్థాయికి వెళ్లాలని చంద్రబాబు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనికోసం పలువురు పార్టీ నేతలకు కూడా నియోజకవర్గ ఇన్ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను, ఆ కుటు-ంబంలోని సభ్యుల ఫోటోలతో సహా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాష్బోర్డులో అప్÷-లోడ్ చేయాలని సిఎం సూచించారు. అయితే, ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ప్రజల నుండి వినతుల వర్షం కురుస్తోందని టిడిపి నాయకులు చెబుతున్నారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతులు పెద్ద సంఖ్యలో అందిస్తుడటం టిడిపి నేతలకు కొంత ఇబ్బందికరంగా మారింది. స్థానిక ఎన్నికలు జరిగేలోగా వీటిని పరిష్కరించకపోతే, వినతులు ఇచ్చిన వారే మరో రకంగా స్పందించే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి వచ్చే ఏడాది ఆరంభంలోనే పంచాయితీలు, మండల పరిషత్, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. 2021లో ఈ విభాగాలకు ఎన్నికలు జరగ్గా, తిరిగి 2026 ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

## ఐదుగురు నిర్వాహకుల అరెస్ట్

హైదరాబాద్, కల్తీ కల్లు కేసులో ఐదుగురు నిర్వాహకులను బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కల్లు కాంపౌండ్లు నిర్వహిస్తున్న నగేశ్ గౌడ్, బి. శ్రీనివాస్ గౌడ్, టి. శ్రీనివాస్ గౌడ్, టి.కుమార్ గౌడ్, తీగల రమేశ్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. నిర్వాహకులకు సంబంధించిన ఐదు షాపులను పోలీసులు సీజ్ చేశారు. మొత్తం 600 లీటర్ల కల్లు స్వాధీనం చేసుకున్నారు. కల్లు కాంపౌండ్‌లో మంగళవారం కల్తీ కల్లు తాగి 19 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. బుధవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీతారాం (47) అనే వ్యక్తి మృతి చెందగా.. ఓ ప్రైవేటు- ఆస్పత్రిలో స్వరూప అనే మహిళ ప్రాణాలు విడిచారు. అంత్యక్రియల కోసం ఆమె మృతదేహాన్ని తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. కల్తీ కల్లు తాగి చనిపోయినట్లు-తేలడంతో పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మరో 15 మంది పంజాగుట్ట నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కల్తీకల్లు ఘటనలో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీతారాం (47) బుధవారం ప్రాణాలు విడిచాడు. వనపర్తి జిల్లా మదిగట్ల గ్రామానికి చెందిన సీతారాం, అనిత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తొమ్మిదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి హైదర్‌నగర్‌లో ఉంటూ సీతారాం మేస్త్రీగ్గా పని చేస్తున్నాడు. కల్తీ కల్లు తాగి మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇవ్వాలని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిజాలు దాచాలని చూస్తోందని ఆరోపించారు. ఈ ఘటనలో ఇవాళ ఒకరు, నిన్న ఇద్దరు.. మొత్తం ముగ్గురు చనిపోయినట్లు- సమాచారం ఉందని చెప్పారు. కల్తీ కల్లు ఎప్పటి నుంచి అమ్మారు ఎంతమంది తాగారు అనే పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం సేకరించాలన్నారు. బాధితులు 20 మంది కంటే ఎక్కువ ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే మరికొందరు ఆసుపత్రిలో చేరుతున్నారని వివరించారు.

## ఛీ కొట్టినట్టేనా?

అమరావతి,వైసీపీ నేత, మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిని కొంతమంది ధ్వంసం చేశారు. ఇంట్లో కనపడిన వస్తువుని కనపడినట్టు విరగ్గొట్టారు. చివరకు కారుని కూడా తిరగతిప్పి అవతలపడేశారు. ఇటీవల కాలంలో ఏపీలో ఎవరి ఇంటి మీద కూడా ఈ స్థాయిలో దాడి జరగలేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ ఘటనపై వైసీపీ నేతల్లో స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సాక్షాత్తూ జగన్ కూడా నేరుగా స్పందించలేదు. నల్లపురెడ్డికి ఫోన్ చేసి దాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారని సాక్షి మీడియాలో వార్తలిచ్చారు కానీ, జగన్ ఆ దాడిని ఖండించారని, రెడ్ బుక్ పేరెత్తి కూటమి పాలనను విమర్శించారని కూడా ఎక్కడా లేదు. పోనీ జగన్ ఏమైనా అజ్ఞాతంలో ఉన్నారా అంటే అదీ కాదు. ఆయన ఇడుపులపాయలో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మీడియాకు దగ్గరగానే ఉన్నారు. కానీ నల్లపురెడ్డి గొడవపై ఆయన స్పందించలేదు. కారణం ఒక్కటే. అక్కడ ప్రసన్న చేసిన తప్పు స్పష్టంగా కనపడుతోంది. ప్రసన్న వ్యాఖ్యలకు అది కరెక్ట్ సమాధానం అని సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. ఇలాంటి టైమ్‌లో ప్రసన్న కుమార్ రెడ్డికి మద్దతుగా జగన్ మాట్లాడి ఉంటే కచ్చితంగా ఆ తప్పుని ఆయన సపోర్ట్ చేసినట్టవుతుంది. అందుకే జగన్ సైలెంట్ అయ్యారు. ప్రసన్న నీచపు వ్యాఖ్యల్ని పరోక్షంగా తప్పుబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎక్కడ ఏ దాడి జరిగినా దాన్ని రెడ్ బుక్ కి లింక్ పెడుతూ మాట్లాడేవారు. వైసీపీ నేతలపై ఎవరు దాడి చేసినా, అది కూటమి ప్రోద్బలంతో జరిగిందేనని విమర్శించేవారు. కానీ మాజీ మంత్రి ఇంటిపై జరిగిన దాడి విషయంలో మాత్రం జగన్ ఇంకా నోరు తెరవకపోవడం ఇక్కడ విశేషం. పొరపాటున నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని జగన్ సమర్థిస్తూ మాట్లాడితే జనంలో తీవ్ర వ్యతిరేకత వస్తుందని ఆయనకు అర్థమైంది. ఇప్పటికే అమరావతి మహిళల విషయంలో తప్పుడు వ్యాఖ్యలు వైసీపీకి తిప్పలు తెచ్చాయి. ఆ తర్వాత కవర్ చేసుకోలేక నానా తంటాలు పడ్డారు. ఇప్పుడు మరోసారి మహిళను, స్వయానా మహిళా ఎమ్మెల్యేను కించపరిచేలా మాట్లాడారు వైసీపీ నేత. దీంతో ఆ వ్యాఖ్యలను సమర్థించేందుకు ఎవరూ సాహసించట్లేదు.

# అందరి టార్గెట్ హండ్రెడ్ సీట్స్.. మూడు పార్టీలది ఒకటే క(గో)ల



హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళకు పైగానే సమయం వుంది. జమిలి ఎన్నికలు వస్తేనో, ఇంకేదైనా జరిగితేనో ఏమో కానీ, లేదంటే.. 2028 సెకండ్ హాఫ్ లో కానీ తెలంగాణ శాసనసభ ఎన్నికలు జరిగే అవకాశం లేదు. నిజానికి.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇంకా నిండా రెండేళ్ళు అయినా కాలేదు. కానీ ఇంతలోనే రాష్ట్రంలో ఎందుకో ఏమో కానీ ఎన్ని 'కలలు' మొదలయ్యాయి. అదికూడా మరెవరో కాకుండా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఎన్ని'కల'లకు శ్రీకారం చుట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో.. వంద అసెంబ్లీ, 15 లోక్ సభ స్థానాలలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో.. రాష్ట్ర రాజకీయ వర్గాల్లో 'వంద' చర్చ మొదలైంది. నిజానికి.. ప్రస్తుత రాజకీయాల్లో బొమ్మా బొరుసూ తారుమారు అయ్యేందుకు మూడున్నర సంవత్స రాలు చాలా చాలా ఎక్కువ సమయం. మూడున్నర సంవత్సరాలు కాదు.. మూడున్నర వారాలలో కూడా రాజకీయం ఉల్టాపల్టా అయ్యే అవకాశం ఉందని నడుస్తున్న చరిత్రే చెపుతోంది. ఎక్కడిదాకానో ఎందుకు.. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందంటే.. కాంగ్రెస్ పార్టీ వీరాభిమానులు కూడా విశ్వసించలేదు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీజేపీ సెల్ఫ్ గోల్ చేసుకోవడంతో హస్త రేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. కాంగ్రెస్ పార్టీ అనూహ్య విజయం సాధించింది. సో.. రాజకీయాల్లో ముఖ్యంగా ఎన్నికల రాజకీయాల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందో.. గెలుపు ఓటములు ఎలా తారుమారు అవుతాయో నెలల ముందు ఉహించడం కూడా ఒక విధంగా సాహసమే అవుతుంది.కానీ.. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు ముందున్న స్థానిక సంస్థల ఎన్నికలను పక్కన పెట్టి, ఎప్పుడో మూడున్నరేళ్ళ తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి ఇప్పటి నుంచే కలలు కంటున్నాయి. నిజానికి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే రాజకీయ ముఖ చిత్రం ఎంతగానో మారిపోయింది. సో... మూడున్నర సంవత్సరాల తర్వాత రాజెవరో రెడ్డెవరో ఇప్పుడే చెప్పడం సాహసం కాదు.. ఒక విధంగా దుస్సాహసమే అవుతుంది. అయినా.. మూడు ప్రధాన పార్టీలూ ఆకాశానికి నిచ్చెనలు వేస్తునాయి. చప్పట్లు కొట్టి చిటికెల పందిళ్ళు వేస్తున్నాయి. అయితే.. అందరికీ తెలిసిన ఈ రాజకీయ సత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియదా, బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు తెలియదా అంటే తెలియక కాదు కానీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎత్తుకున్న 100 అసెంబ్లీ , 15 లోక్ సభ సీట్ల రాగాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు ఎత్తు కున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్ వందకు ఐదు తక్కువ 95 సీట్లు ఖాయంగా వస్తాయని కేటీఆర్ అంటే.. బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు కమలానికి వంద సీట్లు ఖాయమని చెప్పుకొచ్చారు. అంతే కాదు.. గమ్మత్తుగా రామచంద్ర రావు, ప్రజలు బీజేపీకి ఎందుకు ఓటేస్తారు, బీజేపీని ఎందుకు గెలిపిస్తారు అనేందుకు.. కడుపుతో ఉన్నమ్మ కనక మానదు అన్నంత సింపుల్ లాజిక్ చెప్పారు. అవును.. తెలంగాణ ప్రజలు పదేళ్లు టీఆర్ఎస్/బీఆర్ఎస్ సుందర ముదనష్ట పాలన చూశారు. ఇప్పుడు అదే తరహాలో.. ఇంకా చెప్పాలంటే.. అంతకంటే ఘోరంగా సాగుతున్న కాంగ్రెస్ పాలన చూస్తున్నారు. కాబట్టి.. తెలంగాణ ప్రజలకు బీజేపీని గెలిపించడం తప్ప మరో గత్యంతం లేదన్న రీతిలో చెప్పుకొచ్చారు. అయితే ఎవరి కలలు ఎలా ఉన్నా.. వాస్తవాలు మరోలా ఆన్నాయని చరిత్ర చెపుతోంది. రీసెంట్ ఉదంతాలనే ఉదాహరణగా తీసుకున్నా.. 2024 ఎన్నికల్లో బీజేపీ చార్ సౌ పార్ (400 ప్లస్) కలలు కంది. ఫలితం ఏమిటో చెప్పనక్కర లేదు.. దో సౌ చాలీస్' (240) దగ్గరే ఆగిపోయింది. అలాగే.. ఇంకొంచెం వెనక్కి వెళితే, 2023 తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కూడా హండ్రెడ్ ప్లస్ (100ప్లస్) పైనే ఆశలు పెట్టుకుంది. కానీ.. 40 దగ్గరే ఆగి పోయింది.(అందులో ఓ పది సీట్లు ఇప్పటికే జారి పోయాయి అనుకోండి అది వేరే విషయం). అలాగే.. ఇంకో అడుగు వెనక్కివేస్తే, 2019 లోక్సభ ఎన్నికల్లో, మారుమోగిన, సారూ ..కారూ .. పదహారు స్లోగన్ గురించి చెప్ప నక్కర లేదు. సో .. రాజకీయ నాయకుల పగటి కల గురించి అంతగా పట్టించుకోవలసిన అవసరం లేదు కానీ.. రాష్ట్రంలో రగులుతున్న రాజకీయ వివాదాలు మాత్రం, రాను రాను రాజు గుర్రం గాడిద సామెతను గుర్తు చేస్తున్నాయి. రోజురోజుకు గీత దాటుతున్నాయి. రోత పుట్టిస్తున్నాయన్న అభిప్రాయం అయితే సర్వత్రా వ్యక్తమవుతోందని అంటున్నారు.

# క'ర్ణాటకం'మళ్ళీ మొదటికి!?



బెంగళూర్ :కర్ణాటకం మరోమారు తెరపై కొచ్చింది. నిజానికి.. కర్ణాటకలో రెండేళ్ళ క్రితం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే కౌన్ బనేగా ముఖ్యమంత్రి అనే సీరియల్ తెర పైకి వచ్చింది. అయితే.. కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్న సిద్దరామయ్య, డీకే శివకుమార్ ల మధ్య సంధి కుదిర్చింది. ఇద్దరు చెరో రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిని పంచుకునేలా ఒప్పందం కుదిర్చి అప్పటికి ఆ సమస్యను పరిష్కరించింది. సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా,డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయినా.. కారణాలు ఏవైనా ఈ రెండు సంవత్సరాలలో ఇద్దరి మధ్య సంబంధాలు అంత సజావుగా లేవనే విషయంలో ఎలాంటి దాపరికం లేదు. అదలా ఉంటే.. ఫిఫ్టీఫిఫ్టీ పవర్ షేరింగ్ అగ్రిమెంట్ ప్రకారం సిద్దరామయ్య ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకోవలసిన సమయం ఆసన్నం అవుతున్న నేపథ్యంలో గత కొంతకాలంగా ముఖ్యమంత్రి మార్పుఅంశం రాష్టంలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ ప్రముఖంగా చర్చకు వస్తోంది. ముఖ్యమంత్రి మార్పు అనివార్యమనే వార్తలు కూడా ప్రముఖంగా వినిపించాయి. చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా.. ముఖ్యమంత్రి మార్పు నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందని చెప్పడం ద్వారా సీఎం మార్పు తప్పక పోవచ్చన్న సంకేతాలు ఇచ్చారు. అయితే.. అదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం జోక్యం చేసుకుని ఇష్యూని సెటిల్ చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి,కర్ణాటక రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలాను రంగంలోకి దించింది. ఆయన మూడు నాలుగు రోజులు బెంగుళూరులో కూర్చుని, ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరించారు. సంప్రదింపులు జరిపారు. చివరకు అధిష్టానం అనుమతి, ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి మార్పు ఉండదని, ఐదేళ్ళు సిద్దరామయ్య ఒక్కరే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతారనీ.. అదే అధిష్టానం నిర్ణయమనీ ప్రకటించారు.నిజానికి.. ఇది ఒక విధంగా డీకే శివకుమార్ వర్గం ఆశించని, ఆ వర్గానికి ఎంత మాత్రం మింగుడు పడని నిర్ణయం. డీకే వర్గమే కాదు.. జరుగతున్న పరిణామాలను దగ్గరగా చూస్తున్న రాజకీయ విశ్లేశకులు కూడా ముఖ్యమంత్రి మార్పు ఎంతో దూరంలో లేదు, త్వరలోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్థానంలో డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారు ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమనాలు అవసరం లేదని మీడియా సాక్షిగా ప్రకటించారు. అందుకే అధిష్టానం నిర్ణయం అందరినీ ఆశ్చర్య పరిచింది. అయినా.. డీకే శివకుమార్ మాత్రం ఏం చేస్తాం, అధిష్టానం చెపితే వినాలి అన్న ధోరణిలో సిద్దరామయ్య ఐదేళ్ళు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతారని స్వయంగా ప్రకటించారు. అక్కడితో కర్ణాటకం కథ ముగిసిందనే అంతా అనుకున్నారు. కానీ.. ఇంతలోనే పరిస్థితి మళ్ళీమొదటికి వచ్చిందని అంటున్నారు. నిజానికి.. ఇప్పటికీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఐదేళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నారు. కానీ, తాజా పరిణామాల నేపథ్యంలో ఆయనకు పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు అంటున్నారు. నిన్న మొన్నటి వరకు ఐదేళ్లూ సిద్దరామయ్యే ముఖ్యమంత్రి అని చెప్పిన డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవిని ఆశించడంలో తప్పులేదు కదా అంటూ సీఎం కావాలనే తమ మనసులోని ఆశను మరో మారు బహిరంగంగా బయట పెట్టారు. దీంతో మరోమారు ముఖ్యమంత్రి మార్పు అంశం పతాక శీర్షికలకు ఎక్కింది. ఈ నేపథ్యంలోనే.. తాజాగా డీకే శివకుమార్ అనుకూల వర్గానికి చెందిన ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్.. ముఖ్యమంత్రి మార్పు అంశాన్ని మరో మారు తెరపైకి తెచ్చారు. పార్టీలోని మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు, ప్రజల మద్దతు డీకే శివకుమార్ కే ఉందని చెప్పారు. చాలా మంది ఎమ్మెల్యేలు ఒకే మాటపై ఉన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. ఇది కేవలం నా ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదు. పలువురు ఎమ్మెల్యేలు, ప్రజలు ఇదే కోరుకుంటున్నారని యోగేశ్వర్ అన్నారు. అయితే.. నిర్ణయం మాత్రం అధిష్ఠానం చేతిలో ఉందన్నారు. డీకేకు 100 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని మరో నేత చెప్పుకొచ్చారు. దీంతో సుర్జేవాల్ దౌత్యంతో పరిష్కారం అయిన ముఖ్యమంత్రి వివాదం.. మళ్లీ మొదటికి వచ్చింది. నిజానికి.. ఇప్పుడు కూడా ఈ వివాదం కూడా టీ-కప్పులో తుపానులా సమసి పోతుందని అనుకున్నా.. కాంగ్రెస్ అధిష్టానం ఇద్దరు నేతలను గురువారం( జూలై 10) ఢిల్లీ రావాలని ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదో జరగబోతోందన్న ఉత్కంఠకు తెరతీసింది.

# యెమెన్ జాతీయుడి హత్య కేసు..జూలై 16న ఉరిశిక్ష అమలుకు నిర్ణయం

న్యూఢిల్లీ,యెమెన్ జాతీయుడి హత్య కేసులో ఉరిశిక్ష పడిన భారతీయ నర్సు నిమిషా ప్రియకు వచ్చే వారం జూలై 16న ఉరిశిక్ష అమలు చేయనున్నారు. గత సంవత్సరం, కేరళకు చెందిన నిమిషా ప్రియకు యెమెన్ అధ్యక్షుడు మరణశిక్షను ఆమోదించిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఈ విషయాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని, ఆమె కుటుంబ సభ్యులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతున్నామని విదేశాంగ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. సాధ్యమైన అన్ని సహాయాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఉరిశిక్ష పడిన ప్రియా క్షమాభిక్షను ఆ దేశ అధ్యక్షుడు రషద్ అల్-అలిమి గతంలో తిరస్కించారు. 2017 నుంచి యెమెన్ జైలులో శిక్ష అనుభవిస్తున్న నిమిష ప్రియాకు హత్య నేరానికి గాను 2018లో అక్కడి సుప్రీంకోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు నిచ్చింది. తలాల్ అబ్దో మహదీ అనే యెమెన్ పౌరుడి నుంచి తన పాస్పోర్ట్ను తీసుకునే క్రమంలో అతడికి మత్తుమందు ఇంజెక్ట్ చేసిన ప్రియా హత్యచేసినట్టు- పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. ఈ కేసులోనే ఆమెను దోషిగా నిర్ధారించిన ట్రయల్ కోర్టు.. ఉరిశిక్ష ఖరారు చేసింది. దీనిపై ఆమె అక్కడ సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా.. కింద కోర్టు తీర్పును సమర్థించింది. చివరకు క్షమాభిక్ష కోసం యెమెన్ అధ్యక్షుడికి ప్రియా పెట్టుకున్న అభ్యర్థన తిరస్కరణకు గురయ్యింది. కోచిలో పలువురు ఇళ్లలో పనికి వెళ్లే తన తల్లికి సాయంగా ఉండాలని నిర్ణయించుకున్న నిమిష ప్రియ 19 ఏళ్లు కూడా నిండకుండానే 2008లో యెమెన్కు వెళ్లింది. యెమెన్కు వెళ్లిన మూడేళ్లకి, కోచికి తిరిగి వచ్చిన నిమిష, టామీ థామస్ అనే ఆటో డ్రైవర్ను పెళ్లాడింది. పెళ్లయిన తర్వాత థామస్ కూడా నిమిషతో కలిసి యెమెన్ వెళ్లాడు. అక్కడ ఒక ఎలక్ట్రీషియన్కు అసిస్టెంట్గా పని చేశారు.





అయితే 2012లో నిమిషకు ఒక కూతురు పుట్టాక, యెమెన్లో బిడ్డను పెంచడం కష్టమవుతుందని, థామస్ పాపతో కలిసి భారత్కు తిరిగి వచ్చేశారు. రెండేళ్ల తర్వాత, 2014లో ఒక బిజినెస్ పార్టనర్తో నిమిష సొంతంగా ఒక క్లినిక్ను ప్రారంభించారు. యెమెన్లో ఒక వ్యాపారాన్ని ప్రారంభించాలంటే స్థానికులు కచ్చితంగా భాగస్వామిగా ఉండాలి. నిమిషకు తలాల్ అబ్దో మాహ్ది అనే వ్యక్తి స్థానిక వ్యాపార భాగస్వామిగా ఉన్నారు. నిమిష కూతురి బాప్టిజం కోసం భారత్కు వచ్చినప్పుడు, మాహ్ది కూడా ఆమెతో వచ్చారు. నిమిష ఇంటికి వెళ్ళినప్పుడు తన పెళ్లి ఫోటోలను మాహ్ది దొంగిలించారు. తరువాత నిమిషతో తనకి పెళ్లయినట్లు చిత్రీకరించారు. నిమిషను చిత్రహింసలు పెట్టి, క్లినిక్ ఆదాయం మొత్తం అక్రమంగా తీసేసుకునేవారనే ఆరోపణలు మాహ్ది మీద ఉన్నాయి. మాహ్దికు హానికరమైన మోతాదులో మత్తు మందు ఇచ్చి, తన మృతదేహాన్ని ఛిద్రం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొని, 2017లో నిమిష జైలుకు వెళ్లింది.

# మంత్రులకు డేంజర్ బెల్స్?



అమరావతి,కూటమిలో మంత్రుల పనితీరు మీద ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా మంత్రులకు క్లాస్ తీసుకున్నారని ప్రచారం సాగుతోంది. కొత్తగా మంత్రులు రావచ్చు అని కూటమి నుంచి వినిపిస్తోందిట.కొందరు కేబినెట్ లో ఇన్ అయితే మరి కొందరు అవుట్ అవడం ఖాయమని అంటున్నారు. పాతిక మందికే కేబినెట్ లో చోటు ఉంటుంది. అందులో జనసేనకు ఒక బెర్త్ ని ఇస్తే టీడీపీ నుంచి ముగ్గురు నలుగురుకి చాన్స్ ఇస్తారని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే ఉత్తరాంధ్రా జిల్లాల నుంచి ఒకరిద్దరి మంత్రుల విషయంలో చూస్తే కనుక డేంజర్ బెల్స్ మోగుతున్నాయని అంటున్నారు. కీలకమైన శాఖను నిర్వహిస్తున్న వారి మీద ఆరోపణలు వస్తున్నాయని అనుకూల మీడియాలోనే వార్తలు వస్తూండడంతో తప్పిస్తారా అన్న చర్చ సాగుతోంది.జనసేనకు ఒక మంత్రి పదవి అంటే విశాఖ జిల్లా నుంచి సీనియర్ నేత ఒకరికి చాన్స్ రావచ్చు అని అంటున్నారు. అదే విధంగా విశాఖ నగరానికి మంత్రివర్గంలో ప్రాధాన్యత లేకుండా ఉంది. దాంతో ఈసారి కచ్చితంగా చాన్స్ ఇస్తారని చెబుతున్నారు. అది కచ్చితంగా టీడీపీకి చెందిన వారికే దక్కుతుందని అంటున్నారు. ఆ అదృష్టవంతులు ఎవరు అన్నదే అంతా ఆలోచిస్తున్నారుట.తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే విశాఖ సిటీ కంచుకోటగా ఉంది. అయితే మంత్రి లేకపోవడంతో రాజకీయంగా కొంత ఇబ్బందిగా మారిందని అంటున్నారు. విశాఖ జిల్లాను అంతా కలిపి ఉంచడం రాజకీయంగా దూకుడు పెంచడం వంటివి చేయాలంటే మంత్రిని సిటీ నుంచే ఎంపిక చేయాలని అంటున్నారు. దాంతో మంత్రి వర్గ విస్తరణ కానీ మార్పులు కానీ ఉంటే కనుక విశాఖ సిటీకి ప్రాధాన్యత ఉండొచ్చు అని అంటున్నారు. ఈ పుకార్ల వెనక నిజాలు ఏమిటి అన్నది కొంతకాలం ఆగితే తప్ప తెలియదు అన్నది రాజకీయ వర్గాలలో సాగుతున్న చర్చగా ఉంది.

# చైనా 'వాటర్ బాంబ్'.. భారత్ కు ముప్పేనా?



న్యూఢిల్లీ,భారత్-చైనా సరిహద్దులో చైనా ప్రతిపాదించిన భారీ జలవిద్యుత్ ప్రాజెక్టుపై అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును ఆయన 'వాటర్ బాంబ్'గా అభివర్ణించారు, ఇది దేశ భద్రతకు, లక్షలాది మంది జీవనాధారమైన నదీ వ్యవస్థకు తీవ్ర ముప్పు అని హెచ్చరించారు.బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మించతలపెట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు భారత్కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఈ ప్రాజెక్టుపై తన భయాన్ని వ్యక్తం చేస్తూ, ఇది సైనిక ముప్పుకు మించినదిగా అభివర్ణించారు. "చైనాపై ఎటువంటి విశ్వాసం పెట్టలేం. వారు ఏ సమయంలో ఏ చర్యలు తీసుకుంటారో తెలియదు. జలవిద్యుత్ ప్రాజెక్టు పేరుతో వారు భారీ డ్యామ్ నిర్మిస్తున్నారు. కానీ ఇది నీటిని నిల్వ చేయడానికే కాదు.. అవసరమైతే నీటిని ఆయుధంగా మార్చే ప్రయత్నం కావచ్చు. ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే సియాంగ్ ప్రాంతమంతా సమూలంగా నాశనమవుతుంది" అని ముఖ్యమంత్రి ఖండూ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం ఆందోళనను మరింత పెంచుతోంది.

– ప్రాజెక్టు ముప్పులు.. భారత దేశానికి ప్రమాదాలు

చైనా నిర్మించ తలపెట్టిన ఈ భారీ డ్యామ్ నిర్మాణ వ్యయం సుమారు 137 బిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల భారత్ ఎదుర్కోబోయే ప్రధాన ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయి. వేసవి కాలంలో బ్రహ్మపుత్ర నదికి నీటి ప్రవాహం తగ్గిపోవచ్చు. ఇది దిగువ ప్రాంతాల్లోని వ్యవసాయం, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వర్షాకాలంలో చైనా ఒకేసారి భారీగా నీటిని విడుదల చేస్తే, అస్సాం, అరుణాచల్, ఇంకా బంగ్లాదేశ్ ప్రాంతాలు తీవ్ర ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. డ్యామ్ నిర్మాణం పూర్తయిన తర్వాత, చైనా జల పరిపాలనను రాజకీయ లేదా సైనిక ప్రయోజనాల కోసం ఆయుధంగా వాడే అవకాశం ఉందని భారత అధికారులు భయపడుతున్నారు.

– ఒప్పందాల గందరగోళం.. సమాచార లోపం

బ్రహ్మపుత్ర నది జల సమాచారం మార్పిడి కోసం భారత్-చైనా మధ్య మొదటి ఒప్పందం 2002లో కుదిరింది. 2008, 2013, 2018లో ఈ ఒప్పందంలో మార్పులు చేశారు. అయితే 2023తో ఆ ఒప్పందం గడువు ముగిసింది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పునఃఒప్పందం జరగలేదు, దీంతో చైనా ఇప్పుడు ఎలాంటి సమాచారం భారత్తో పంచుకోవడం లేదు. ఇది దిగువ ప్రాంతాల్లోని ప్రజలకు నది ప్రవాహంపై కచ్చితమైన అంచనా వేయడంలో అడ్డంకిగా మారింది.

– రక్షణ భద్రతకు తీవ్ర ముప్పు

ఈ ప్రాజెక్టు అత్యంత సున్నితమైన సరిహద్దు ప్రాంతానికి సమీపంలో ఉండటంతో, భవిష్యత్తులో యుద్ధ పరిస్థితుల్లో చైనా నీటిని ఆయుధంగా వాడే అవకాశాన్ని భారత ప్రభుత్వ వర్గాలు కొట్టిపారేయలేకపోతున్నాయి. ఇది భారత రక్షణ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. ఈ పరిణామాలపై కేంద్రం సీరియస్గా స్పందించాలని, అంతర్జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని అరుణాచల్ సీఎం పెమా ఖండూ డిమాండ్ చేస్తున్నారు.చైనా నిర్మించబోయే ఈ మెగా ప్రాజెక్టు ఒక సాధారణ డ్యామ్ కాదు, అది ఒక నీటి బాంబు. ఇది పరిసర దేశాల భద్రత, జీవనాధార వ్యవస్థలపై తీవ్రమైన ముప్పుగా మారే అవకాశముంది. భారత ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని అంతర్జాతీయ ఒత్తిడిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నగరంలో మరో డ్రగ్స్ ముటా గుట్టురట్టు

హైదరాబాద్,భాగ్యనగరంలో ఈగల్ టీమ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో మరొక డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేశారు. కొంపల్లిలోని మల్నాడు రెస్టారెంట్ కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు- గుర్తించారు. మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య నేతృత్వంలో డ్రగ్ సరఫరా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రముఖ ఆస్పత్రిలోని కార్డియాలజీ డాక్టర్ ప్రసన్నకు కూడా డ్రగ్స్ సరఫరా చేసినట్లు వెల్లడించారు. భీమవరానికి చెందిన డాక్టర్ ప్రసన్న ఇప్పటివరకు 20 సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. సూర్య ఫ్రెండ్ హర్ష ద్వారా డాక్టర్ ప్రసన్న డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు- విచారణలో తేలింది. 23 మంది వ్యాపారవేత్తలకు సూర్య డ్రగ్స్ సరఫరా చేశాడు. ప్రముఖ పబ్లకు వెళ్లి డ్రగ్స్ పార్టీ ఇచ్చినట్లు- గుర్తించారు. పబ్బుల్లో డ్రగ్స్ పార్టీ కోసం యజమానులు ప్రత్యేక ఏర్పాట్లు- చేస్తున్నారు. ప్రిజం పబ్, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్ పబ్, బ్లాక్ 22 పబ్, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్లో డ్రగ్స్ దందా నడుస్తున్నట్లు- కనుక్కున్నారు. వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్, బ్రాడ్ వే యజమానులపైన పోలీసులు కేసు నమోదు చేశారు. క్వాక్ రాజాశేఖర, కోరా పబ్ పృథ్వీ వీరమాచినేని, బ్రాడ్ వే ఓనర్ రోహిత్ మాదిశెట్టిలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ ముగ్గురు పబ్బు యజమానులతో కలిసి పార్టీలు నిర్వహించినట్లు- మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య పేర్కొన్నారు. ములుగులోని రిసార్ట్లోకి ఫ్రెండ్స్ని పిలిచి పార్టీలు ఇచ్చినట్లు-



సూర్య తెలిపారు. కొంపల్లిలో డ్రగ్స్ అమ్ముతున్నట్లుగా సమాచారం రావడంతో అధికారులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన మహిళ చెప్పుల మాటున డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. లేడీస్ హై హీల్స్ చెప్పుల లోపల డ్రగ్స్ పెట్టి మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్యకు నైజీరియన్స్ పార్సిల్ చేశారు. ఢిల్లీకి చెందిన నిక్కి, జెర్రీ నైజీరియన్లు కలిసి సూర్యకు డ్రగ్స్ పంపించినట్లు ఈగల్ టీం అధికారులు గుర్తించారు. మల్నాడు రెస్టారెంట్స్ యజమాని సూర్య అతని మిత్రుడు హర్షలను అరెస్టు చేసి ఈగల్ టీం అధికారులు విచారణ జరుపుతున్నారు.

# స్కూల్ బస్సులో మంటలు.. విద్యార్థులకు తప్పిన ప్రమాదం



హైదరాబాద్,అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట లో పెను ప్రమాదం తప్పింది. విధ్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే డ్రైవర్, సహాయకుడు అప్రమత్తమవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.గురువారం ఉదయం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కు చెందిన బస్సులోకి కిష్టారెడ్డిపేట వద్ద విద్యార్థులు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో బస్సులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన డ్రైవర్ పిల్లలను వెంటనే బయటకు దింపేశారు. మంటలు వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే.. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com